₹40

నవంబర్ - 2024

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine


సంపుటి : 34 • సంచిక : 2



NOVEMBER - 2024

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA


CENTRAL
SINCE 1947
BOOKS
Your trusted Academic Partner - Then, Now & Forever
DIAMOND JUBILEE
CELEBRATING 75 YEARS OF
KNOWLEDGE, TRUST & LEADERSHIP
12 lakhs + Customers
700+ Schools
15 Business Awards
Online Services
Digital Learning
Books and Stationery Supplies
Head Office : 6-3-553,C1, Quena Square, Erramanzil, Somajiguda, Hyderabad. Tel: 040-24098282
Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.
Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.
www.centralbooks.in

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి: 34 Volume: 34 | సంచిక : 2 Issue : 2 | హైదరాబాద్ Hyderabad | నవంబర్ November | పేజీలు 52 Pages 52 | రూ. ₹. 40

## లోపలి పేజీల్లో.......










| | | |
|---|---|---|
| ఈ నెలంతా మీదే...... | మణికొండ వేదకుమార్ . | 5 |
| సర్ సివి రామన్ (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| ప్రపంచ బాలల దినోత్సవం (చిల్డ్రన్స్ డే) | డా. నీరజ అమరవాది | 7 |
| చిలుక సాయం (కథ) | కీర్తి | 8 |
| దీపా మాలిక్ | షీరోస్–256 | 9 |
| గుణింతాల గుణగణాలు – 2 (అక్షరం) | వై. మల్లికార్జున రావు | 10 |
| ఉసిరి చెట్టు (చెట్టు – చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 11 |
| రహస్యము (కథ) | వడ్డేపల్లి వెంకటేష్ | 12 |
| చిన్న పిల్ల – కుక్కగొడుగులు (కథ) | లియో టాల్ స్టాయ్ | 13 |
| చదరంగం (ఆట) | చిన్ననాటి ఆటలు – జ్ఞాపకాల మూటలు | 14 |
| విజయమా – నైపుణ్యమా (కథ) | ఎన్. సాకేత్ | 16 |
| సైంటిఫిక్ టెంపర్ (సైన్స్ వెన్నెల–1) | డా నాగసూరి వేణుగోపాల్ | 18 |
| బుద్ధి వచ్చింది (కథ) | గద్వాల కిరణ్‌కుమారి | 19 |
| మార్పు (నాటిక) | పుప్పాల కృష్ణమూర్తి | 20 |
| మూడు చేపల కథ | పంచతంత్ర కథ | 24 |
| గాలి (పంచభూతాలు) | బెలగాం భీమేశ్వరరావు | 24 |
| కొండపల్లి కోటను చూద్దాం... కొండపల్లి బొమ్మలు తెచ్చుకుందాం... (యాత్ర) | జుగాష్ విలి | 25 |
| కాబూలీ వాలా (కార్టూన్) | కే. ఉషారెడ్డి | 26 |
| తొలిసారి టీ20 ప్రపంచ కప్ విజేతగా న్యూజిలాండ్... (క్రికెట్) | సచిన్ కోత్వాల్ | 27 |
| సామాజిక సేవ | | 28 |
| కోడీ కోడీ – కొక్కొరోకో! (పాట) | పిల్లల పాటల పరిమళం | 28 |
| జాలరి – బంగారు చేప (కథ) | అనిల్ బత్తుల | 29 |
| లీడర్ (కథ) | డా. హారిక చెరుకుపల్లి | 32 |
| తెలంగాణా ఎత్తిపోతల జలపాతం (విహార స్థలాలు) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 33 |

పిచ్చుక (పక్షి) ........................................................................
పొమ్మని తోస్తే తిరిగి వచ్చే డబ్బా (సైన్స్) ..........................................
అబ్దుల్ కలాం భావనలు (కవిత) ..............................................
చెలిమి క్లబ్ ........................................................................
కార్తీక పున్నమి పూట గురునానక్ జయంతి (పండుగ) ..............................
పాప సాయం (కథ) ..................................................................
మంచి ఆహారపు అలవాట్లు (ఆరోగ్యం - విజ్ఞానం) ..............................
నేర్చుకుందామా ......................................................................
కలం చెలిమి ........................................................................
కాలం మారింది (కథ) ..............................................................
నోబెల్ బహుమతి విజేతలు-2024 (జి.కె.) ..............................................
నా పల్లెటూర్లు (ఆడుతూ పాడుకుందాం) ..............................................
చెట్టమ్మ (ఆడుతూ పాడుకుందాం) ..............................................
ఎలుకుర్తి నుంచి మహీంద్రా యూనివర్సిటీ వరకు (విద్యార్థులే స్ఫూర్తిదాతలు) .....
బాలచెలిమి గ్రంథాలయంపై సమీక్ష ..............................................
బొమ్మలేద్దామా... ..................................................................
సమాచారం ..........................................................................
సరోజినీ నాయుడు (వ్యక్తిత్వం) ..............................................

జుగాష్ విలి .............................. 34
డాక్టర్ మహీధర నళినీ మోహన్ ......... 35
గద్వాల సోమన్న .......................... 36
బాలచెలిమి .............................. 36
డా. అమ్మిన శ్రీనివాసరాజు .............. 37
జి. మేఘన .............................. 39
బాల సారస్వతం (ఆరోగ్యం-విజ్ఞానం) .. 40
.................................................. 41
బాలచెలిమి .............................. .41
డాక్టర్ దాసోజు పద్మావతి ................ 42
సచిన్ కోత్వాల్ .......................... 43
షేక్ అంజుమ్ .............................. 44
డా. శారదాహన్మాండ్లు .................... 44
కాసుల రవికుమార్ ........................ 45
పైడిమర్రి గిరిజా .......................... 46
నందన్ కృష్ణ .............................. 47
బాలచెలిమి డెస్క్ .......................... 48
సువేగా .................................... 50




# చెలిమి లేఖలు

బాల చెలిమి అక్టోబర్ సంచికలో నేను రాసిన మంచి మిత్రులు కథ అచ్చయింది. అది నాకు ఎంతో సంతోషం కలిగించింది. మా తెలుగు సార్ డాక్టర్ సాగర్ల సత్తయ్య సార్ ప్రోత్సాహంతో నేను కథలు రాస్తున్నాను. భవిష్యత్తులో మంచి రచయిత్రి కావాలని అనుకుంటున్నాను. నా తొలి కథను ప్రచురించిన బాల చెలిమి సంపాదకులకు హృదయపూర్వక ధన్యవాదాలు.

**- సిహెచ్. సాత్విక**

8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాటికల్ నల్గొండ

మా బడిలోని పుస్తకాలయంలోని బాల చెలిమి పుస్తకంలోని "అల్లరి అవంతిక" అనే పుస్తకంలోని అవంతిక, ఆమె ప్రపంచం అనే కథను చదివాను నాకు ఆ కథ చాలా బాగా నచ్చింది. ఆ కథ వల్ల నాకు ఆడపిల్లలు ఎలా ఉండాలి అని తెలుసుకున్నాను. మాకు మా గ్రంథాలయంలోని పుస్తకాలు చాలా ఉపయోగపడుతున్నాయి.

**- బి. అంజలి**

9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జల్లేపల్లి, ఖమ్మం.

బాలచెలిమి గ్రంథాలయం మా పాఠశాలలో ఏర్పాటు చేసి దాదాపు సంవత్సరం పూర్తి అయ్యింది. ఈ పుస్తకాలు చదివిన మా విద్యార్థులు భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని, అనేక జిల్లా, రాష్ట్ర స్థాయి కథల పోటీలో పాల్గొని బహుమతులు పొందటం సంతోషంగా ఉంది. మా పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయం ఏర్పాటు చేసిన బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్, గరిపెల్లి అశోక్ గార్లకి హృదయపూర్వక ధన్యవాదాలు

**- బచ్చలి సత్తయ్య**

జిహెచ్ఎం., జెడ్‌పిహెచ్ఎస్, కుకునూరుపల్లి


Niyara Rao Chalikani
*Pic by*
***Shruthika Nanda Manikonda***
*Kasu Vana, Goa on 15.08.2023*



*బొమ్మలు:*
కూరెళ్ల శ్రీనివాస్
m : 98495 43728

**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com
Mob: 98480 44713

# ఈ నెలంతా మీదే...

పిల్లలూ... నవంబర్ అంటే మీ నెల. నవంబర్ 14న దేశవ్యాప్తంగానూ, 20న ప్రపంచ వ్యాప్తంగానూ బాలల దినోత్సవాలు జరుపుకుంటున్నాం. నవంబర్ 14 నుంచి ఓ వారం రోజుల పాటు గ్రంథాలయ వారోత్సవాలు కూడా జరగబోతున్నాయి. ఇన్ని వేడుకల మధ్య ఈ నెలంతా మీదే అయితే... ఎంత బావుంటుంది. రోజువారీ తరగతులకు పెద్ద ఇబ్బంది లేకుండానే మిమ్మల్ని ఆనంద పెట్టే కార్యక్రమాలు మనం ఎందుకు చేసుకోకూడదు! మనమంటే మీరు, మీ అమ్మానాన్నలు, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులు. ఇంత మందిమి కలిస్తే ఓ నెల పాటు మీకు ఎంత ఆనందాన్నివ్వగలం! ఆనందంతో పాటు మీలోని సృజనాత్మకతను, నైపుణ్యాలను మీకు మీరే గుర్తించేలా చేయగలం! మెరుగులు దిద్దగలం!



దీనికి మనమేం చేయాలి!

ప్రతి పాఠశాలలో వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం, చేతివ్రాత, నృత్యం, నాటికలు, పాటలు, ఆటలు, కథా, కవితా రచనల్లో పోటీలు నిర్వహించాలి. వీలున్న చోట మండల, జిల్లా స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహించాలి. ఈ పోటీలన్నీ మీలోని సృజనాత్మకతను, భావనా శక్తినీ, వ్యక్తీకరణ సామర్థ్యాలను వెలికి తీస్తాయి. మీ మధ్య ఆరోగ్యకర పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి. వివిధ పాఠశాలల విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలను, కలివిడి తనాన్ని, మీలో సామాజిక ప్రవర్తనా తీరును మెరుగుపరుస్తాయి.

అంతర్జాతీయ పిల్లల సినిమాలను ప్రతి పాఠశాలలో ప్రదర్శించాలి. వీటి ద్వారా దేశ దేశాల పిల్లల తీరుతెన్నులు మీకు తెలుస్తాయి.

మీ మనోవికాసానికి ఈ అన్ని కార్యక్రమాలు తోడ్పడతాయి. హాయిగా పార్టిసిపేట్ చేయండి. ఆటపాటలతో కేరింతలు కొడుతూ నవ్వండి.

మీ నవ్వులతో, సంతోషాలతో ఈ నవంబరు నెలకు అందాల్ని అద్దండి.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి



సైంటిస్ట్

# సర్. సి.వి. రామన్

చంద్రశేఖర వెంకట రామన్ 1888 నవంబర్ 7న తమిళనాడులోని తిరుచిరాపల్లిలో జన్మించారు. అతని తండ్రి గణితం మరియు భౌతిక శాస్త్రంలో లెక్చరర్‌గా పని చేసారు. రామన్ విద్యా ప్రతిభ చాలా చిన్న వయస్సులోనే వెలుగు చూసింది. అతను పదమూడు సంవత్సరాల వయస్సులో తన మాధ్యమిక పాఠశాల విద్యను పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో Mrs. A.V.N.లో ప్రవేశించాడు. తరువాత చెన్నైలోని ప్రతిష్టాత్మక ప్రెసిడెన్సీ కళాశాలలో చేరారు. అతను ఫిజిక్స్ మరియు ఇంగ్లీష్ ఆనర్స్‌తో డిగ్రీని, కేవలం పద్దెనిమిది సంవత్సరాల వయస్సులో M.Aలో అగ్రస్థానం సాధించారు.



రామన్ Indian Audit and Accounts Serviceలో చేరి కలకత్తాలోని ఫైనాన్స్ విభాగంలో Assistant Accountant General గా నియమితు లయ్యారు. కలకత్తాలో, Indian Association for the Cultivation of Science ప్రయోగశాలలో పని చేయడం ద్వారా విజ్ఞాన శాస్త్రంపై తన ఆసక్తిని పెంచుకున్నారు. తన ఖాళీ సమయంలో తీగ వాయిద్యాలు మరియు భారతీయ భౌతిక శాస్త్రాన్ని అభ్యసించాడు.

1917లో రామన్ తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకుని కలకత్తా విశ్వవిద్యాలయంలోని సైన్స్ కాలేజీలో Sir Taraknath Palit Professor of Physics అయ్యారు. (1917–33). ప్రకంపనలు, ధ్వని, సంగీత వాయిద్యాలు, ultrasonics, diffraction, photoelectricity, colloidal particles, X-ray diffraction, magnetron, dielectrics మొదలైన రంగాలలో పరిశోధనలకు ఆయన అపారమైన కృషి చేశారు. ముఖ్యంగా, ఈ కాలంలో కాంతి చెదరగొట్టడంపై ఆయన చేసిన కృషి ఆయనకు ప్రపంచ వ్యాప్త గుర్తింపును తెచ్చిపెట్టింది.

1924లో ఆయన Royal Society of Londonకు ఫెలోగా ఎన్నికయ్యారు, ఒక సంవత్సరం తరువాత రాయల్ సొసైటీ నుండి ప్రతిష్టాత్మక హ్యూస్ పతకంతో సత్కరించబడ్డారు. నాలుగు సంవత్సరాల తరువాత, బెంగళూరులోని South Indian Science Association మరియు Science Club of Central College సంయుక్త సమావేశంలో, ప్రస్తుతం రామన్ ఎఫెక్ట్‌గా పిలుస్తున్న దాని గురించి తన ఆవిష్కరణను ప్రకటించారు.

1929లో నైట్ పదవిని పొందాడు, 1930లో కాంతి చెదరగొట్టడానికి సంబంధించిన (the Raman Effect) ఆవిష్కరణ లకు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మొదటి ఆసియా శాస్త్రవేత్త రామన్. 1934లో, అతను బెంగళూరులో కొత్తగా స్థాపించబడిన Indian Institute of Science డైరెక్టర్ అయ్యాడు, అక్కడ అతను తన పదవీ విరమణ వరకు ఉన్నాడు. ఆయన బెంగళూరులో Raman Research Instituteను స్థాపించారు. 1954లో భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రదానం చేసింది.

– జుగాష్విలి
బాలచెలిమి, m : 9848266384



# ప్రపంచ బాలల దినోత్సవం

"నేటి పిల్లలు రేపటి భారతదేశాన్ని తయారు చేస్తారు.
ఆ పిల్లలని పెంచే విధానమే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది".
-జవహర్ లాల్ నెహ్రూ

బాల్యం అనేది చాలా తక్కువ విషయాలతో, ఆనందంగా జీవించగలిగే జీవితకాలం. ఇది మంచి భవిష్యత్తును నిర్మిస్తూ, పిల్లల అపరిమిత ఊహలకు రెక్కలనిచ్చే ముఖ్యమైన దశ. కానీ, ఈ దశలో వారు పొందాల్సిన అవకాశాలను అనేక కారణాలతో అందుకోలేక పోతున్నారు. అందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సినది బాలకార్మిక వ్యవస్థ. ఇది పిల్లల అన్ని హక్కులను హరించివేస్తుంది. సమతుల ఆహారాన్ని, విద్యను పొందలేని పిల్లల దుస్థితిని చూసి అంతర్జాతీయ కార్మిక సంస్థ(ILO) 1925లో ప్రపంచ బాలలదినోత్సవం అనే భావనతో ముందుకొచ్చింది. ఈ బాలలదినోత్సవం ద్వారా అన్ని వృత్తులలోని వ్యక్తులకు బాలల హక్కులు, వారి సంక్షేమం, సమస్యలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నాన్ని చేసింది. 1954లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ద్వారా నవంబర్ 20ని ప్రపంచ బాలల దినం గా ప్రకటించింది. ప్రపంచమంతటా పిల్లల సంక్షేమాన్ని ప్రోత్సహించేటందుకు పలుచర్యలు చేపట్టడం ఈ బాలలదినోత్సవ లక్ష్యం. 0 నుండి 18సంవత్సరాల వయస్సు గల వారందరు బాలలుగానే పరిగణింపబడతారు. లింగం, జాతి, మతం, వైకల్యం, లైంగిక ధోరణి లేదా ఇతర హోదాలతో సంబంధం లేకుండా ప్రతిబిడ్డకు వారి అవకాశాలను అందించాలని ప్రచారం చేస్తారు. ఎందుకంటే పిల్లల హక్కులు, సంరక్షణ అనే దృక్పథాలు బలపడడానికి ప్రచారం, ఉద్యమం అవసరం అయ్యాయి. ఈ నేపధ్యంలో 1989లో బాలల హక్కులను పేర్కొంటూ యునిసెఫ్(UNICEF) పిల్లల అవసరాలకు వర్తించే, లక్ష్యాలను, ప్రాథమిక హక్కులను రూపొందించింది. బాలల హక్కులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. వీటిలో ముఖ్యమైనవి (అ)వాక్ స్వాతంత్ర్యం, (ఆ)భావప్రకటనా స్వేచ్ఛ, (ఇ) భయం నుండి విముక్తి, (ఈ) ఉచిత నిర్బంధ విద్య, (ఉ) తమ శరీరాలపై యాజమాన్యం.

ప్రపంచ బాలల దినోత్సవం అనేది పిల్లల కోసం జరుపుకునే ఒకరోజు పండుగ కాదు. ప్రపంచ వ్యాప్తంగా దుర్వినియోగం, దోపిడి మరియు వివక్ష వంటి రూపాలలో హింసను ఎదుర్కొంటున్న పిల్లలకు అవగాహన కల్పించడం. అంతేకాక తల్లిదండ్రులకు పిల్లల మీద సర్వహక్కులూ ఉంటాయనుకునే దుష్టనీతి నుండి అందరూ బయటపడే విధంగా అవగాహన కలిగించడం.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వైద్యులు, నాయకులు, పౌరసమాజ కార్యకర్తలు, మీడియా నిపుణులు, యువకులు అందరు ప్రపంచ బాలలదినోత్సవానికి ప్రాముఖ్యతను జోడించడంలో గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నారు. బాలలదినోత్సవంలో భాగంగా పిల్లలు, సెలబ్రిటీస్ ల మధ్య స్నేహపూర్వక ఆటపాటలతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు.

భారతదేశం 1964 వరకు బాలలదినోత్సవాన్ని నవంబర్ 20 నవే జరుపుకునేది. భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ. ఆయన దేశ స్వాతంత్ర్యోద్యమంలో ప్రధానపాత్రను పోషించారు. ఆయన పిల్లలను ఇష్టపడేవారు. పిల్లలు నెహ్రూని ప్రేమగా 'చాచా నెహ్రూ' అని పిలుచుకునేవారు. పిల్లలే దేశభవిష్యత్తు. వారు తెలివైనవారైతే దేశం సుభిక్షంగా ఉంటుందనే భావించేవారు. 1964న నెహ్రూ మరణించిన తరువాత ఆయన జయంతిని బాలలదినోత్సవంగా జరుపుకుంటున్నాము. ఆ రోజున భారతదేశమంతటా పిల్లలచే మరియు వారి కోసం అనేక విద్యాపరమైన మరియు ప్రేరణాత్మక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. బాల్యం ఆటలకు పర్యాయపదం. ఆటపాటలతో వికసించాల్సిన ప్రాయం.

"Let us sacrifice our today. So that our children can have a better tomorrow"
- A.P.J. Abdul Kalam

– డా.నీరజ అమరవాది
m : 9849160055

కథ

# చిలుక సాయం



బొల్లారం గ్రామంలో రేణుక అనే అమ్మాయి ఉండేది. తను రాణి అనే ఒక చిలుకను పెంచుకునేది. ఆ అమ్మాయి సెలవులు వచ్చినప్పుడల్లా ఆమె అమ్మమ్మ, తాతయ్య వాళ్ళ ఇంటికి వెళ్ళేది. అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో చెట్లు చాలా ఉండేవి. అందువల్ల రేణుకకు అమ్మమ్మ ఊరు బొల్లారం అంటే మహా ఇష్టం. రేణుక ఎప్పటిలాగే ఎండాకాలం సెలవులకు తన పెంచుకునే రాణి చిలుకతో బొల్లారం వెళ్ళింది. రేణుక జామకాయలు అన్ని చెట్టు కింద పడి ఉండటం గమనించింది. ఏమిటి అమ్మమ్మ కాయలన్నీ రాలిపడి ఉన్నాయి అని అడిగింది. ఏం చెప్పను అమ్మ రేణుక రోజూ ఒక కోతి వస్తుంది. కాయలన్నీ తెంపి కింద పడేసి వెళ్తుంది. ఎంత అదిలించినా మళ్లీ మళ్లీ వస్తూనే ఉంది. పచ్చి కాయల్నే తెంపి పడేసి వెళుతుంది. పండు అయ్యే దాక ఉంచటం లేదు అని బాధ పడింది. అప్పుడు రేణుక ఎలాగైనా కోతిని మార్చాలి అనుకుంది. రాణిచిలుకతో ఎలాగైనా కోతితో నువ్వే మాట్లాడాలి తన కాయ తెంపి పడేయకుండా చూడాలి అని ప్రాధేయపడింది. జామ చెట్టు పైన ఉన్న కోతిని చూసింది. రాణి చిలుక, రేణుక ఇద్దరు చెట్టు దగ్గరికి వెళ్ళారు. వెంటనే చిలుక ఆ చెట్టుమీద వాలింది. కోతి బావా! కోతి బావా! నేను చూడు పండ్లను నా చిన్ని పొట్టకు కావలసినంత మాత్రమే తిని మిగతాది వదిలేస్తాను. మరి నువ్వు ఏంటి? నీ కడుపు నిండే దాకా తిను. అంతేకానీ ఎందుకు ఇలా ఎవరూ తినకుండా పచ్చికాయలు తెంపి పడేస్తావు. కోతి చేష్టలు అని మనుషులతో అని అనిపించుకుంటూ తిట్లు తింటావు. దయచేసి నువ్వు మారు. ఈ పండ్లు ఊర్లో ఎంతో మంది ఆకలి తీరుస్తున్నాయి. అడవులు కొట్టేయడం వల్లే కదా ఇలా ఇండ్లల్లో చెట్లమీద పండ్లు తింటున్నావు. ఇక నువ్వు ఇళ్లల్లోకి రావడం మొదలు పెట్టావు అంటే ఇళ్లల్లో కూడా చెట్లు కొట్టేస్తారు. అప్పుడు మనలాంటి జంతువులకు, పక్షులకు మాత్రమే కాదు మనుషులకు కూడా ఆహార కొరత ఏర్పడుతుంది. అని చిలుక కొద్దిగా అర్థమయ్యేలా చెప్పింది. అయ్యో! అవునా! చిలుక. నేను ఇదంతా ఆలోచించలేదు. నువ్వు చెప్పింది నిజమే. నేను ఇక నా కోతి చేష్టలు మానేస్తాను. కేవలం నా ఆకలి మాత్రమే తీర్చుకుంటాను. అనవసరంగా కాయలు పండ్లు తెంపి పడేయను. అని తప్పు తెలుసుకుంది రాణి చిలుక సంతోషంతో రేణుక దగ్గరకు వచ్చి కోతి మారిపోయిందని చెప్పడంతో రేణుక చాలా సంతోష పడింది. రేణుక ద్వారా కోతిలో వచ్చిన మార్పును చూసి అమ్మమ్మ తాతయ్యలు మురిసి పోయారు.

– కీర్తి
8వ తరగతి (ఇ/మీ), జెడ్‌పిహెచ్‌ఎస్ (గర్ల్స్),
మిర్యాలగూడ, నల్గొనండ జిల్లా, m : 9989596554

# దీపా మాలిక్

ఛాలెంజెస్ నుండి ఛాంపియన్‌షిప్‌ల వరకు : ఎ టేల్ ఆఫ్ అన్‌స్టాపబుల్ రెసిలెన్స్.

అత్యుత్తమ ప్రదర్శనలకు పేరు గాంచిన ఒక పారా – అథ్లెట్ (అంగవైకల్యం కలిగిన క్రీడాకారిణి) దీపామాలిక్.

1999లో ఆమెకు వెన్నెముకలో కణితి ఉన్నట్లుగా నిర్ధారణ అయింది. శస్త్ర చికిత్స తర్వాత ఆమె నడుము క్రింది భాగం పక్షవాతానికి గురైంది. ఇంతటి సవాలు ఉన్నప్పటికి, ఆమె సైకిల్ తొక్కడం మరియు యమునా నదిలో ఈత కొట్టడం వంటి వివిధ క్రీడలను అభ్యసించింది.




పారాలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారతీయ మహిళ. 2016 వేసవి అంగవైకల్య ఒలంపిక్ ఆటలో, ఆమె షాట్‌పుట్‌లో రజత పతకాన్ని సాధించింది. ఆమె 2018 ఆసీయా పారాలింపిక్ గేమ్స్‌లో (ఆటలో), కొత్త జాబితాను నెలకొల్పింది. వరుసగా మూడు ఆసియా పారాగేమ్స్‌లో పతకాలు సాధించిన ఏకైక భారతీయ మహిళ. ఆమె బహుళ విభాగాల్లో 58 జాతీయ, 23 అంతర్జాతీయ పతకాలను గెలుచుకుంది.

దీపా తన సాహసోపేత స్ఫూర్తికి పేరు గాంచింది. ఆమె 8 రోజులు, 1,700 – కిలో మీటర్ల ప్రయాణంలో సబ్ – జీరో ఉష్ణోగ్రతలలో పాల్గొంది, అందులో 18,000 అడుగుల వరకు భయంకరమైన హిమాలయా పర్వతాలను అధిరోహించింది. ఆమె "క్లీన్ ఇండియా" బ్రాండ్ అంబాసిడర్, "స్మార్ట్ సిటీస్" ప్రాజెక్ట్‌లో భాగంగా వికాలాంగులకు అనుకూలమైన మౌళిక సదుపాయాలను రూపొందించడంలో నిపుణురాలు. క్రీడలకు ఆమె చేసిన అద్భుతమైన సేవలను గుర్తించి అర్జున అవార్డు, పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్‌రత్న అవార్డులతో సహా ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులతో ఆమెను సత్కరించారు.

దీపా మాలిక్ సంకల్పం, పట్టుదల, కష్టాల్లో అసాధారణ విజయాలు సాధించేందుకు ప్రేరణగా నిలిచాయి. ఆమె ఫెడరేషన్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎంఎస్‌సిఐ) నుండి అధికారిక ర్యాలీ లైసెన్స్‌ని పొందిన భారతదేశపు మొదటి శారీరక వికలాంగ వ్యక్తి.

– 'షీరోస్–256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా'

నుండి....

అక్షరం



# గుణింతాల గుణగణాలు - 2

గత సంచికలో ఇచ్చిన గుణింతాలను సరిగ్గా అభ్యాసం చేసిన పిదప ఈ మిగిలిన గుణింతాలను అభ్యసించండి.

**ఋత్వం :**

బృందావనం, గృహం, కృషి వంటి అద్భుతమైన పదాలు రాసేటప్పుడు వాడే ఋత్వాన్ని కొంత మంది చవకబారుగా రాసి ఆ పదం యొక్క ఔన్నత్యాన్ని కూడా తగ్గించేస్తూ ఉంటారు.

ఈ విధంగా రాయకండి :




ఇలా అభ్యసించాలి :



**ఋత్వ దీర్ఘం :**

ఋత్వానికి దీర్ఘాన్ని జత చేసి రాస్తే చాలు.



**ఎత్వం / ఏత్వం :**


ఎత్వం ఇలా రాస్తే "గుడి" మాదిరిగా కనబడే అవకాశాలుంటాయి.



ఎత్వం చివరి భాగాన్ని కుడివైపు నుంచి ఎడమవైపుగా రాసే అడ్డగీతను జత చేసి రాయాలి




అక్షరానికి ఏత్వాన్ని జతచేసి రాసే ప్రక్రియలో ఎత్వం రాసిన తర్వాత చేతిని పైకెత్తి, విడిగా ఏత్వాన్ని జతచేసి రాయాలి.




**ఐత్వం :**

చాలా మంది విద్యార్థులు ఎత్వం క్రింద రాసే గీతను 'త' ఒత్తుతో పొరపడి రాస్తుంటారు. అది తప్పు.



ఎత్వం రాసే క్రమంలో ప్రారంభ గీతలో సున్న ఆకారం అవసరం లేదు. కానీ క్రింది భాగంలో రాసే ఐత్వం గీతను సున్న ఆకారంతో ప్రారంభించాలి.




**ఒత్వం / ఓత్వం :**

దీర్ఘం మాదిరిగానే ప్రారంభించి అడ్డగీత మధ్యలో ఒక చిన్నపాటి నొక్కు రాసి, చివరిగా సవ్యదిశలో సున్న ఆకార రాయడంతో ఒక మంచి ఒత్వం ఆకారాన్ని పొందవచ్చు. అంతేకానీ అచ్చులో మాదిరిగా ఉబ్బెత్తు ఆకారాలతో రాయవలసిన అవసరం లేదు.




అదే విధంగా ఓత్వం విషయంలో అచ్చులో కుడివైపుకి ఉండే ఆకారాన్ని చేతిరాతలో ఎడమ వైపుకు రాయవచ్చు.





**ఔత్వం :**

ఎత్వానికి ఒక చక్కటి దీర్ఘాన్ని జత చేస్తే మంచి ఔత్వం పొందవచ్చు



**చివరిగా**

అం అః లను హల్లులకు చివర్న వాడే క్రమంలో అక్షరానికి సమానమైన ఎత్తులో సున్నను రాస్తూ, అక్షరానికి కుడి వైపుకు సరిపడా రెండు సున్నాలనూ రాయడం సరైన పద్ధతి.



- వై. మల్లికార్జున రావు



డైరెక్టర్, మహా అకాడెమి, m : 9966961642

# ఉసిరి చెట్టు



హాయ్ బాలలూ.. బాగున్నారా! సెలవుల్లో బతుకమ్మ, దసరా పండుగ బాగా ఎంజాయ్ చేశారు కదా! గత బాల చెలిమి సంచికలో జమ్మి చెట్టు గురించి తెలుసుకున్నాం. ఈ నవంబర్ సంచికలో ఉసిరి చెట్టు గురించి తెలుసు కుందామా...!

ఎంతో పవిత్రమైనదిగా పూజించే ఉసిరి చెట్టు కార్తీక మాసం వచ్చిందంటే చాలు ప్రజలంతా ఎక్కడ ఉందా అని అన్వేషిస్తారు. ఈ మాసంలో ఉసిరి చెట్టు కింద ఒక్క పూటైనా భోజనం చేయాలన్నది హైందవ సంప్రదాయం. ఎందుకంటే కార్తీకమాసంలో శ్రీ మహావిష్ణువు, లక్ష్మీదేవి ఇద్దరూ కొలువై ఉంటారన్నది విష్ణు పురాణం కథనం. ఉసిరిని భూమాతగా కొలుస్తారు. దేవదానవ సంగ్రామంలో కొన్ని అమృత బిందువులు పొరపాటున భూమి మీద పడడంతో ఉసిరి చెట్టు పుట్టిందన్నది ఓ కథనం ఉంది. వృద్ధాప్యాన్ని దరిచేరనివ్వని ఔషధ మొక్కలలో ఉసిరికి ఉసిరే సాటి అని “చరక సంహిత” గ్రంథం చెబుతుంది. అందుకే ప్రతి వ్యక్తి తన జీవిత కాలంలో ఐదు ఉసిరి చెట్లు నాటాలని చెబుతుంటారు. కార్తీక పౌర్ణమి నాడు ఉసిరి చెట్టు కింద వనభోజనాలను సూత మహర్షి తన మునులందరితో చేసినట్లు పురాణంలో తెలుపబడింది. అందుకే ఉసిరి చెట్టు కింద వన భోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఉసిరి చెట్టులో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఇది శ్రీహరికి అత్యంత ప్రీతిపాత్రమైన వృక్షం. వనభోజనాలకు ఉసిరి చెట్టు నీడ శ్రేష్ఠం. ఉసిరి చెట్లు ఉన్న తోటలో వన భోజనాలు చేస్తే వారి పాపాలు సైతం తొలగిపోతాయనేది నమ్మకం. ధాత్రి అంటే ఉసిరిక. ఉసిరిక లక్ష్మీదేవికి ఆవాసమై ఎంతో ఇష్టమైనది. ఉసిరి చెట్టు మీద ఈ కార్తీకమాసంలో నారాయణుడుంటాడని అందుకనే ఈ చెట్టుని ధాత్రి నారాయణుడిగా భావించి పూజ చేయాలని శాస్త్రాల్లో చెప్పారు. ఉసిరి చెట్టుకి ఎనిమిది వైపులా దీపాలు పెట్టి ఎనిమిది ప్రదక్షిణలు చేయాలని, ఈ ఉసిరి పత్రితో విష్ణువుకి పూజ చేయాలని పెద్దలు అంటుంటారు. చలికాలం వచ్చిందంటే చాలు ఉసిరి కాయలు బాగా కనిపిస్తాయి. ఉసిరికాయలో చేదు తప్ప ఐదు రకాల రుచులు ఉంటాయి.

### ఉసిరి చెట్టు వల్ల కలిగే ప్రయోజనాలు


* ఉసిరి చెట్టు ఆధ్యాత్మిక భావన కలిగిస్తుంది.
* ఉసిరికాయలను ఊరబెట్టి పచ్చడి పెడతారు. ఎంతో కమ్మగా ఉంటుంది.
* ఉసిరికాయలు భుజించడం వల్ల “సి విటమిన్” పుష్కలంగా లభిస్తుంది.
* ఉసిరికాయలను తినడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది.
* మన శరీర ఉష్ణోగ్రతను కూడా సమతుల్య స్థితిలో ఉంచుతుంది.
* ఉసిరికాయలను ఎండబెట్టి పౌడర్ చేసి మందుల్లో కూడా వాడుతారు.

ఇలా తెలియని ఎన్నో విషయాలను మనం తెలుసు కున్నాము కదా! ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉన్న ఉసిరి చెట్టును మనం కూడా పెంచుదామా బాలలూ!

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655

కథ

# రహస్యము




రత్నాల కొండ అనే గ్రామంలో శివయ్య అనే రైతు ఊరికి దూరంగా ఇల్లు కట్టుకుని భార్యా పిల్లలతో నివసిస్తూ ఉండే వాడు. ఒంటరిగా ఇల్లు ఉండటంతో ఒక కుక్కను పెంచుకునేవారు. కుక్కతో పాటు కొన్ని కోళ్ళు, బాతులు కూడా ఉండేవి. అతని పొలాలు కూడా ఇంటికి దగ్గర్లోనే ఉండేవి. పొలాల చుట్టూ ఉన్న కొండలపై రత్నాలు ఉన్నాయనే ప్రచారం బాగా ఉంది. అందుకే చాలామంది సుదూర ప్రాంతాల నుండి వచ్చి రత్నాల వేట చేస్తూ ఉండేవారు.

శివయ్య కూడా పొలం నుండి వస్తూ కొండలపై రత్నాల వేట చేస్తూ తన అదృష్టాన్ని పరీక్షించుకునేవాడు. కానీ అతనికి నిరాశే ఎదురయ్యేది. ఎలాగైనా ఏదో ఒక రోజు రత్నాలను వెతికి సంపాదించాలనే కోరిక బలంగా ఉండేది శివయ్యకు.

శివయ్య పెంచుకున్న కోళ్ళు, బాతులు ఆహారం కోసం కొండ దగ్గరకు వెళ్తూ ఉండేవి. వాటికి కాపలాగా కుక్క కూడా వెళ్ళేది. కొండ పక్కనే ఉన్న చెరువులో ఈత కొడుతూ బాతులు ఆహారాన్ని సేకరించేవి. ఒక రోజు చెరువు ఒడ్డున మిల మిలా మెరుస్తున్న ఓ రత్నం కనబడింది ఓ బాతుకు. అది ఏదో తినే ఆహారం అనుకుని గుటుక్కున మింగేసింది. ఈ దృశ్యాన్ని కుక్క చూసి పరుగు పరుగున వచ్చింది ఇలా అన్నది.

"అయ్యో.. బాతూ.. విలువైన రత్నాన్ని మింగేసావు కదా..! ఇలాంటి రత్నం కోసం మన యజమాని ఎన్నో ఏళ్లుగా వెతుకుతున్నాడు."

"అలాగా... నాకేం తెలుసు అది విలువైనదని!? ఇప్పుడు నేనేం చేయాలి!? యజమానికి ఈ విషయం చెప్పేద్దామా!?" అంది బాతు.

"అలా చెబితే నిన్ను చంపేసి నీ కడుపులో ఉన్న రత్నాన్ని తీసుకుంటాడు. అలా జరగడం నీకు ఇష్టమా!?" అన్నది కుక్క.

బాతు భయపడింది. మిగతా కోళ్ళు, బాతులు చుట్టూ చేరి ఆసక్తిగా వింటున్నాయి వీటి సంభాషణను.

"జాగ్రత్తగా వినండి... మన మిత్రుడి ప్రాణం నిలవాలంటే ఒక్కటే మార్గం. మన మిత్రుడు, రత్నం మింగాడు అనే విషయాన్ని రహస్యంగా ఉంచాలి. అలా ఉంచకపోతే మనందరి ప్రాణాలు పోవచ్చు..." అని హెచ్చరించింది కుక్క.

మిగతా కోళ్ళు, బాతులు సరే నన్నాయి.

అలా ఆ రహస్యం రత్నంతో పాటు వాటి కడుపులోనే ఉండిపోయింది.


– వడ్డేపల్లి వెంకటేష్

m : 9989596554



కథ

# చిన్న పిల్ల – కుక్కగొడుగులు



ఆడపిల్లలు ఇద్దరు కుక్కగొడుగులు ఏరుకుని ఇంటికి వెళుతున్నారు. దారిలో రైలుకట్టను దాటాలి.

రైలు ఇంకా ఎంతో దూరంలో వుందనుకుని గట్టు ఎక్కి, రైలు పట్టాలు దాటుతున్నారు. ఉన్నట్టుండి రైలు మోత వినిపించింది. అక్క చప్పున వెనక్కి పరిగెత్తింది. చెల్లి రైలుకట్ట దాటేసింది. చెల్లిని చూసి అక్క కేక వేసింది:

"వెనక్కి రాకు, అక్కడే వుండిపో!"

కాని రైలు మోతకి ఆ కేక చెల్లికి వినబడలేదు. అక్క తనను వెనక్కి రమ్మంటోందని వెనక్కి పరుగెత్తింది. పరుగెత్తడంలో తొట్రుకుని కుక్కగొడుగులన్నీ కింద పడిపోయాయి. వాటిని ఏరుకుందుకని పట్టాల మధ్య ఆగిపోయింది. అప్పటికే రైలు బాగా దగ్గరకొచ్చేసింది. పూర్తి శక్తితో ఇంజను చేత కూత పెట్టించాడు డ్రైవరు.



అక్క గట్టిగా అరిచింది "కుక్క గొడుగుల్ని అక్కడ పారేయ్!" అని. కాని, కుక్కగొడుగుల్ని ఏరుకోమని అక్క చెబుతోందనుకుని, ఆ చిన్నపిల్ల వాటిని ఏరుకుందుకు పట్టాల మధ్య పాకుతోంది.

డ్రైవరు రైలుని ఆపలేకపోయాడు. ఇంజను తన శక్తి అంతటితోనూ కూతపెట్టి, ఆ పిల్ల మీద నుంచి వెళ్లిపోయింది.

అక్క కెవ్వన కేక పెట్టింది, మొర్రోమని ఏడ్చింది. రైల్లో వున్న ప్రయాణీకులందరూ కిటికీల్లో నుంచి చూశారు. పిల్ల వున్న స్థలం మీద నుండి రైలు వెళ్లి పోయింది. పట్టాల మధ్య పిల్ల బోర్లపడి ఏ చలనమూ లేకుండా పడుకుని వుండడం రైలులోని వాళ్లు చూశారు.

రైలు ఎంతో దూరం వెళ్లిపోయాక, ఆ పిల్ల తల పైకెత్తి మోకాళ్ల మీద నుంచుని, కుక్కగొడుగులు ఏరుకుని, అక్క దగ్గరికి పరుగెత్తింది.

**లియో టాల్ స్టాయ్ బాలల కథలు నుండి**

# చదరంగం ఆట

**ఎంతమంది పాల్గొనవచ్చు** – ఇద్దరు.

**ఎక్కడ ఆడవచ్చు** – చెస్ బోర్డు పెట్టుకొని ఎక్కడైనా ఆడుకోవచ్చు

**ఈ ఆటకు గల ఇతర పేర్లు** – చెస్

'చదరంగం ఆట' అరవై నాలుగు గళ్ళు కలిగిన ఒక చదరపు బల్ల మీద ఆడతారు. ఈ అరవై నాలుగు గళ్ళలో నలుపు తెలుపు గళ్ళు, ఒక దాని తర్వాత ఒకటిగా వస్తాయి, పావులు కూడా రెండు వర్గాలుగా విభజించబడి ఉంటాయి. ఒకటి నలుపు, ఇంకోటి తెలుపు. ఆటగాళ్ళు తాము ఆడే పావుల రంగుబట్టి గుర్తించబడతారు. ఇలా ఇద్దరు ఆటగాళ్లు చెరో పదహారు పావులతో ఆట మొదలు పెడతారు. ఆ పదహారు పావులు ఇవీ... ఒక రాజు, ఒక మంత్రి, రెండు ఏనుగులు, రెండు గుర్రాలు, రెండు శకటాలు, మరియు ఎనిమిది సిపాయి పావులు. ఎవరు తెల్ల పావులని తీసుకోవాలి ఎవరు నల్ల పావులని అన్న విషయాన్ని స్నేహపూర్వక ఒప్పందం ద్వారా కాని, టాస్ వేయడం ద్వారా కాని నిర్ణయించవచ్చు. చదరంగం బల్లని అమర్చడం ఆటగాడి కుడి చేతి వైపు క్రింద తెల్ల గడి ఉండేట్టుగా బోర్డుని పెట్టాలి. ఆట ప్రారంభంలో మొదటి రెండు అడ్డ వరసలలో పావులను అమరుస్తారు. రెండవ వరసలో ఎనిమిది బంట్లు అమర్చి, మొదటి వరసలో మూల గళ్ళలో ఏనుగులు, వాటి పక్క గుర్రాలు, వాటి పక్క శకటాలు అమర్చాలి. ఇప్పుడు మిగిలిన రెండు మధ్య గళ్ళలో రాజు, మంత్రులను అమర్చాలి. అయితే నల్ల మంత్రిని నల్ల గడిలో, తెల్ల మంత్రిని తెల్ల గడిలో పెట్టాలి.

## ఎత్తులు

మొదట ఎత్తు వేసే హక్కు తెల్ల పావులది. ఆ తర్వాత ఒకరి తర్వాత ఒకరు ఎత్తులు వేసుకుంటూ పోతారు. ఒక ఎత్తులో ఒక పావుని మాత్రమే కదల్చాలి,



ఒక్క కోట కట్టడంలో తప్ప. పావుని వాటి వాటి నియమాల ప్రకారం ఏదేని ఖాళీ గడికి కాని, ఎదుటి పావులని చంపి ఆ పావులున్న గడికి కాని కదల్చవచ్చు. చంపిన పావులు ఆట నుండి బయటకు తీసివేయ బడతాయి.

ఎవరి రాజైనా దాడిలో ఉంటే (అంటే తర్వాతి ఎత్తులో రాజును చంపగలిగే సామర్థ్యం ఎదుటి పావుల్లో దేనికి ఉన్నా) రాజుకే షరా (check) అన్నమాట. తన రాజు షరాలోకి వచ్చే ఏ ఎత్తు ఆటగాడు వెయ్యలేడు. ఎదుటి ఆటగాడు తన రాజుకి ఏదైనా పావుతో షరా చెపితే, 1) రాజుని షరా నుంచి తప్పించగలిగే ఎత్తు కాని, 2) రాజుకి, షరా చెప్పిన పావుకీ మధ్య వేరే పావు వచ్చే ఎత్తు కాని, లేదా 3) షరా చెప్పిన పావుని తీసి వేసే ఎత్తుకాని వెయ్యాలి. అటువంటి ఎత్తు లేకపోతే ఆటకట్టు (checkmate) అయినట్లే, అంటే ఆట ఓడిపోయినట్లే. చదరంగం ఆడడం బుద్ధికి కసరత్తుగా కొంతమంది గుర్తిస్తారు. చదరంగం ఆటలో మేధాశక్తి, విజ్ఞాన పరిజ్ఞానం, వ్యూహాత్మకత, కళానైపుణ్యం కలిసి ఉంటాయని చెప్పవచ్చును.

**ప్రతి పావు ఎత్తుకి నియమాలు :**

**రాజు:** అడ్డంగా కాని, నిలువుగా కాని, మూలగా కాని ఒక్క గడి కదలొచ్చు.

**ఏనుగు:** అడ్డంగా కానీ, నిలువుగా కానీ ఎన్ని గళ్ళు అయినా కదలవచ్చు. కదిలే గడికి, ప్రస్తుతం ఉన్న గడికి మధ్య అన్నీ ఖాళీ గళ్ళు అయి ఉండాలి (కోట కట్టడంలో కూడా ఏనుగు కదులుతుంది).

**శకటు:** మూలగా ఎన్ని గళ్ళు అయినా కదలవచ్చు. కదిలే గడికి ప్రస్తుతమున్న గడికి మధ్య అన్నీ ఖాళీ గళ్ళు అయి ఉండాలి. అయితే శకటు ఎప్పుడూ గడి రంగు మార్చదు గమనించండి. అందుకని నల్లగడి శకటు, తెల్ల అనడం పరిపాటి.

**మంత్రి:** అడ్డంగా కానీ, నిలువుగా కానీ, మూలగా కానీ ఎన్ని గళ్ళు అయినా కదలవచ్చు. కదిలే గడికి ప్రస్తుతమున్న గడికి మధ్య అన్నీ ఖాళీ గళ్ళు అయి ఉండాలి.

**గుర్రం:** వేరే పావుల మీంచి దూకగలదు. ఉన్న గడి నుంచి రెండు గళ్ళు అడ్డంగా ఒక గడి నిలువుగా లేక రెండు గళ్ళు నిలువుగా ఒక గడి అడ్డంగా కదిలి ఇంగ్లీష్ అక్షరం “L” లాగా కదుల్తుంది.

**బంటు:** బంటు ఎప్పుడైనా ఒక గడి (ఖాళీగా ఉంటే) ముందుకు వెళ్ళగలదు. పుట్టుగడి నుండి మాత్రం ఒక గడి కానీ రెండు గళ్ళు కానీ (ఖాళీగా ఉంటే) ముందుకు వెళ్ల గలదు. బంటు వెనక్కు కదలలేదు.

**– ‘చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు’ నుండి...**



## బాలలను పనిలో చేర్చుకుంటే చట్టపరంగా చర్యలు

బాలలు తమ బాల్యాన్ని బడిలోనే గడిపే విధంగా చూడాలి. బాలలతో పనులు చేయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు. పిల్లల్ని పోషించలేని పరిస్థితి ఉన్న తల్లిదండ్రులు బాల రక్షా కమిటీ కార్యాలయాన్ని సంప్రదించి తగిన సలహాలను, సూచనలు పొందవచ్చు. పిల్లల చదువులకు అండగా ఉంటాం.

**– ధనసిరి ప్రకాశ్**

బాలల సంక్షేమ కమిటీ సభ్యుడు, వికారాబాద్.

కథ



# విజయమా - నైపుణ్యమా

ఒక ఊరిలో ఒక బాలుడు ఉండేవాడు. అతను చాలా చురుకైనవాడు. తనకు ఎప్పుడూ తన తరగతిలో మొదటి ర్యాంక్ రావాలనే కోరిక ఉండేది. కానీ అతను తరగతిలో మొదటి ర్యాంకు రాకపోవడంతో, ఒక రోజు తన తండ్రితో ఇలా అన్నాడు. "నాన్నగారు! నేను ఎలాగూ తరగతిలో మొదటి ర్యాంకు రాలేకపోతున్నాను. మరి నేను చదువు మానేసి మీకు వ్యాపారంలో సహాయం చేస్తాను" అని అన్నాడు. అప్పుడు ఆ తండ్రి, "పిచ్చివాడా! నీకు మొదటి ర్యాంకు రాకపోవడం వల్ల ఎటువంటి నష్టము" లేదు. నీకు నేను ఓ చిన్న కథ చెబుతాను విను, ఒక రాజ్యంలో ఇద్దరు మహాయోధులు ఉండేవాళ్ళు. వారు రోజూ వారి యుద్ధవిద్యలను అభ్యసించేవారు. ఇతర సైనికులకు నేర్పిస్తూ, వాళ్ళు కూడా కొందరితో పోట్లాడేవాడు. మొదటి యోధుడు తనకంటే బలహీనుడితో పోట్లాడే వాడు. అందువల్ల తన యుద్ధ నైపుణ్యం ఏమీ పెరగలేదు. కానీ రెండవ యోధునికి యుద్ధ నైపుణ్యం బాగా పెరిగింది. ఒకసారి ఈ ఇద్దరు యోధులు ఉన్న రాజ్యానికి, మరో రాజ్యానికి యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో మొదటి యోధుడు మరణించాడు. ఎందుకంటే, తను గెలవడానికి అలవాటు పడిపోయాడు. తాను ఎప్పుడూ బలహీనుడితోనే పోటీపడి గెలిచేవాడు కానీ, తన యుద్ధ నైపుణ్యాన్ని పెంచుకోలేదు. రెండవ వాడు కొన్నిసార్లు గెలుస్తాడు, కొన్నిసార్లు ఓడతాడు అలాగే తన యుద్ధ నైపుణ్యం కూడా పెరిగింది. కాబట్టి రెండవ యోధుడు బాగా పోరాడి, రాజ్యాన్ని గెలిపిస్తాడు. ఆ రాజ్యం యొక్క రాజు ఆ యోధునికి ఎన్నో బహుమానాలు ఇస్తాడు. ఈ కథ ద్వారా నీకు ఏమర్థమైంది కుమారా? చదివి క్లాసులో మొదటి



ర్యాంకు రావడం కన్నా చదువులో నీ నైపుణ్యాన్ని పెంచుకోవడం మంచిది. అందువల్ల నువ్వు మొదటి ర్యాంకు దగ్గరకు రావలసిన అవసరం లేదు. మొదటి ర్యాంకే నీ దగ్గరకు వస్తుంది. మొదటి ర్యాంకు అనే ఆలోచన వదులుకొని, నీవు కొత్త విషయాలు నేర్చుకోవడానికి ప్రయత్నించు. అప్పుడే నీవు బాగుపడతావు అన్నాడు. అప్పటి నుండి ఆ బాలుడు రోజూ బడికి వెళ్ళి కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆసక్తి చూపాడు. కాబట్టి మిత్రులారా, విజయం వెంట వెళ్ళకుండా, మన నైపుణ్యాన్ని పెంచుకునే మార్గంలో వెళితే విజయమే మన వెంట వస్తుంది.

– ఎన్. సాకేత్

10వ తరగతి, విజయ్ హై స్కూల్ నిజామాబాద్

## సామెతలు

- అత్తలేని కోడలుత్తమురాలు కోడల్లేని అత్త గుణవంతురాలు.
- అబద్ధం ఆడిన అతికినట్టుండాలి.
- నీరు పల్లమెరుగు నిజము దేవుడెరుగు.
- అయితే ఆదివారం కాకుంటే సోమవారం.
- ఏమీ లేని యెడారిలో ఆముదము చెట్టే మహా వృక్షము.
- కాచిన చెట్టుకే రాళ్ళ దెబ్బలు.
- చింతకాయలు అమ్మేదానికి సిరిమానం వస్తే, ఆ వంకర టింకరవి యేమి కాయలని అడిగిందట.
- అదృష్టం బాగోకపోతే అరటిపండు తిన్నా పన్ను విరిగిపోద్ది.
- ఎలుక తోకను తెచ్చి ఏడాది ఉతికిన నలుపు నలుపే గాని తెలుపు కాదు.

– బాలచెలిమి

సైన్స్ వెన్నెల-1

# సైంటిఫిక్ టెంపర్

నేను 40 ఏళ్ల క్రితం బిఎస్సి చదివే సమయంలో మొట్టమొదటిసారి 'సైంటిఫిక్ టెంపర్' (Scientific temper) అనే మాట విన్నాను. డిగ్రీలో లెక్చరర్ చల్లా ఉపేంద్ర ప్రసాద్ మాకు ఆర్గానిక్ కెమిస్ట్రీ చెబుతూ పాఠం మధ్యలో ఈ మాటను వాడారు. నేను వినడం అదే మొదటిసారి. దాన్ని తొలుత ప్రయోగించింది సైంటిస్ట్ కాదు, ఒక రాజకీయ నాయకుడు అని జవహర్లాల్ నెహ్రూ పేరు చెప్పారు. అది నిజంగా ఆశ్చర్యం కలిగించే విషయమే. స్వాతంత్ర్యోద్యమ కాలంలో భారత రాజకీయ రంగంలో చాలా విషయాల పట్ల లోతైన అవగాహన, మంచి పాండిత్యం, అద్భుతమైన రచనాశైలి గల నాయకులు ఇద్దరు– జవహర్లాల్ నెహ్రూ, రామ్ మనోహర్ లోహియా. ప్రస్తుతం శాస్త్రదృష్టి, సైన్సు దృక్కోణం అనే భావంతో 'సైంటిఫిక్ టెంపర్' అనే పదం వాడుతున్నాం.



జవహర్లాల్ నెహ్రూ తన పుస్తకం 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో 'సైంటిఫిక్ టెంపర్' గురించి మొదట చర్చించారు. ఆ పుస్తకం 1946లో ప్రచురింపబడింది కనుక అప్పటినుంచి ఇది ఛలామణిలో ఉందని మనం పరిగణించాలి. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇది మరింత గౌరవప్రదమైన స్థానాన్ని ఆక్రమించింది. 1958లో సైన్స్ పాలసీ వచ్చినప్పటి నుంచి ఇది మరింత చర్చనీయాంశమైంది. దీని ప్రకారం అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ఒకవైపు సైన్స్ పరిశోధనా సంస్థలను నిర్మిస్తూనే, మరోవైపు సైన్సు, సమాజం మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాలను బలోపేతం చేయడానికి కృషి చేశారు. ఉదాహరణకు మన హైదరాబాదులో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (IICT), నేషనల్ జియోలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (NGRI), నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (NIN), సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (CCMB), సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్, ఇక్రిశాట్ మొదలైన పరిశోధనా సంస్థలు ఉన్నాయి.

స్థూలంగా సైన్స్ టెంపర్ అనే మాటని తెలుగులో 'శాస్త్రీయ అభినివేశం' అని మనం అనువాదం చేసుకోవచ్చు. 'సైన్స్ టెంపర్' అంటే ఒక ఆలోచనా విధానం, అలాగే సైన్సు విధానంలో మనకున్న సమస్యలను పరిష్కరించుకోవడం కూడా. ప్రశ్నించడం, పరిశీలించడం, పరీక్షించడం, ప్రతిపాదన చేయడం, విశ్లేషణ చేయడం, తర్వాత ఫలితాలను అందరూ పంచుకోవడం. ఈ విధానంలో శాస్త్రీయ అభినివేశం సాగుతుంది. ఇంకా ఇది శాస్త్రీయ దృష్టిని ప్రోత్సహిస్తూ, శాస్త్రీయపరమైన అభివృద్ధిని కోరుకుంటూబీ మూఢనమ్మకాలను, మతపరమైన మూర్ఖత్వాన్ని, కుహనా సైన్స్ విధానాలను తిరస్కరించడం అనే మార్గంలో పోతుంది. ఇందులో సత్యం కోసం, నూతన జ్ఞానం కోసం అన్వేషించడం ఉంటుంది. అలాగే పరిశీలించి, నిర్ధారించుకున్న విషయాలను గౌరవించడంతో పాటు, అర్థవంతంగా ఆలోచించడం కూడా ఉంటుంది. అంతకు మించి పరీక్ష చేయకుండా అంగీకరించడాన్ని ఆమోదించదు. ఇంకా కొత్త సమాచారం వచ్చి, సాక్ష్యాలు అదనంగా చేకూరినప్పుడు తొలుత చేసుకున్న ప్రతిపాదనలను కూడా మార్చుకోవడానికి సిద్ధంగా ఉండాలి.

– డా నాగసూరి వేణుగోపాల్
m : 9440732 392

కథ

# బుద్ధి వచ్చింది




సంతోష్, అభిషేక్‌లవి పక్కపక్కనే ఇండ్లు. చదువుకోవడం కోసం అభిషేక్ అమ్మమ్మ ఊరికి వచ్చిండు. ప్రభుత్వ బడిలో వీరిద్దరూ ఆరవ తరగతి చదువుతున్నరు. కొద్ది రోజుల్లోనే ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు.

వాళ్లింట్లో స్వీట్లు ఏమి చేసినా తీసుకొచ్చి అభిషేక్‌కు ఇచ్చేవాడు సంతోష్. చదువులో వెనుకబడ్డ అభిషేక్‌కు చదవడం నేర్పించాడు. అభిషేక్ వాళ్ల అమ్మమ్మ ఇద్దరికీ మంచి నీతికథలు చెప్పేది. ఒకరోజు తన పెన్ను ఎవరో తీసుకున్నారని అభిషేక్ ఏడుస్తుంటే... సంతోష్ ఆ రోజే తాను కొనుక్కున్న, తనకిష్టమైన పెన్నును అభిషేక్‌కు ఇచ్చిండు. తను పాత పెన్నుతో రాసుకున్నడు.

ఒకరోజు అభిషేక్ దగ్గర యాభై రూపాయల నోటును చూసిండు సంతోష్. ఎక్కడిదని అడిగిండు. అమ్మమ్మ ఇచ్చిందని చెప్పిండు అభిషేక్. రెండు రోజుల తరువాత మళ్లీ వంద రూపాయల నోటు అభిషేక్ పుస్తకాల మధ్య కన్పించింది. దీంతో సంతోష్ ఈ విషయం అమ్మమ్మతో చెప్పిండు. ఆమె కంగారుగా సంచిలో వెతికింది. వంద రూపాయల నోటు కన్పించలేదు. అదే సమయంలో నోటి నిండా చిరుతిండి బుక్కుకుంటూ అభిషేక్ వచ్చిండు. అమ్మమ్మ చీవాట్లు పెట్టింది. అభిషేక్ సిగ్గుపడుతూ అమ్మమ్మకు క్షమాపణ చెప్పిండు. స్నేహితుడు బాధపడుతున్నాడని భుజం మీద చెయ్యేసి ఓదార్చిండు సంతోష్. సంతోష్‌కు కొత్త పెన్ను ఇస్తూ తన పెన్ను పోలేదని, అబద్ధమాడానని, క్షమించమని అడిగిండు. తన స్నేహితుడు సంతోష్‌తో కలిసి బాగా చదువుకుంటానని అమ్మమ్మతో చెప్పిండు.

స్నేహితుడు మారినందుకు చాలా సంతోషిస్తూ... కొత్త పెన్నును తన గుర్తుగా అభిషేక్‌కే ఇచ్చిండు సంతోష్.

అమ్మమ్మ చాలా సంతోషించింది.

– గద్వాల కిరణ్‌కుమారి
m : 9642401878

నాటిక

# మార్పు



### 1వ దృశ్యం

(తెర లేచేసరికి రైతు ఇల్లు. పదేళ్ల బాలుడు వీపుకు సంచి తగిలించుకుని ఇంటికొస్తాడు)

మనవడు: తాతయ్యా.... తాతయ్యా..... (హడావిడిగా పిలుస్తుంటాడు)

తెరలోంచి స్త్రీ గొంతు: మీ తాత చెట్టు కొట్టనీకి చెలకకు బోయిండు. కాళ్లు, చేతులు కడుక్కో. పాలు తాగుదువు గాని.

మనవడు: నాయనమ్మ, తాత ప్రమాదకరమైన పని చేయబోతున్నాడు. వెంటనే ఆపాలి. నాకు పాలు తాగే సమయం లేదు. (పరిగెత్తుతాడు స్టేజికి మరోవైపుకి)

తెరలోంచి స్త్రీ గొంతు: చెట్టు కొట్టడానికి వెళ్లాడంటే ప్రమాదకరమైన పనంటాడేవిటి వీడు. ఈ రోజు కొత్తగా మాట్లాడుతున్నాడే? వచ్చాక అడగాలి సంగతేందో?

* * *

### 2వ దృశ్యం

(చేను దృశ్యం. తాత ఒక రాయి మీద గొడ్డలిని నూరుతూ పదును చూస్తుంటాడు. పదును సరిపోయిందని తలవూపి, లేచి చెట్టు వద్దకు వెళతాడు. చెట్టుపై వేటు వేయబోతాడు)

మనవడు: తాతయ్యా... ఆగు తాతయ్యా... ఆ చెట్టును కొట్టబోకు తాతయ్యా (అని అమాంతం వచ్చి చెట్టును కౌగిలించుకుంటాడు)

తాత: ఏవైందిరా నీకు. చెట్టు కొట్టకుంటే మనకు తలుపులు, ధర్వాజాలు ఎట్లారా?

మనవడు: ప్లాస్టిక్ తలుపులు ధర్వాజాలు వాడాలే కానీ, కలప కోసం చెట్టును నరకొద్దు తాతయ్యా. చెట్టును నరకడమంటే, మన గొయ్యిని మనం తవ్వుకున్నట్లే. చెట్లు మనకు దైవంతో సమానం. ఆ దేవుడు కనబడకుండా మనకు సహాయపడితే, చెట్లు మనం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి అడుగడుగునా వంద రకాలుగా సహాయ పడుతున్నాయి.

తాత: ఎట్లా? వంద రకాలా? పగలు కాస్త బువ్వదిన్నాక, కూనింత కునుకు దియ్యడానికి కాస్త నీడనిస్తది. ఇంట్లె వంట చెయ్యడానికి పొయిలో కట్టెలుగా

పనికొస్తయి. అంతే గదరా?

మనవడు: అంతే గాదు తాతయ్యా. పచ్చని చెట్టు టన్నుల కొద్దీ ప్రాణవాయువును విడుదల చేస్తుంది. ఈ ఆక్సిజన్ పీల్చుకునే గదా మనం జీవించేది.

తాత: అవునురో. గాలి లేకుంటే మనిషి బతకలేడు గదా.

మనవడు: ఇంకా చెట్టు తనలో 15000 గేలన్ల నీటిని నిలువ చేసుకుంటది తన ఆకుల్లో కొమ్మల్లో వేర్లల్లో కలిపి.

తాత: అవునా? భలే ఉందిరా. ఇంకా చెప్పు.

మనవడు: చెట్లు మబ్బుల్ని ఆకర్షించి, వర్షం కురిసేలా చేస్తాయి. వర్షాల వల్లనే గదా పంటలు పండేది.



తాత: వాన కురిస్తేనే మనం బతికేదని తెలుసులేరా. ఇంక చెప్పు.

మనవడు: భూసారం కొట్టుకు పోకుండా కాపాడతాయి. అంతేగాదు తాతయ్యా. భూమి లోపలి రాతిపొరల్లో ఉన్న ఫ్లోరిన్‌ను తగ్గించి, మనకు స్వచ్ఛమైన మంచినీటిని అందిస్తాయి కూడ.

తాత: మధ్యలో ఈ ఫ్లోరిన్ ఏందిరా? మొన్న కలక్టర్ గారు కూడా దీని గురించి సాలా సెప్పిండు. గానీ మనకు సంబంధం లేదని నేను సెవిన పెట్టలేదు. కూసింత ఇవరంగ సెప్పు. అట్ల గూసో. (మనవడు రాతి మీద కూర్చుంటాడు)

మనవడు: మనం తాగే నీళ్లలో ఫ్లోరిన్ అనే ఒక పదార్థం ఉంటది. అది ఒక లీటరుకు పార్ట్ పర్ మిలియన్ ఉంటే మనుషులకు మేలు చేస్తది. అంతకంటే ఎక్కువ అంటే 1.5 ఉంటే ఫ్లోరోసిస్ వ్యాధి బారిని పడతారు.

తాత: పెమాదవే. ముందు వ్యాధంటున్నావు? దాని లక్షణాలు ఎట్లుంటయో చెప్పరా అబ్బయా.

మనవడు: ఈ ఫ్లోరోసిస్ వ్యాధి ప్రధానంగా నీళ్ల ద్వారా వ్యాపిస్తుంది. తినే ఆహారం ద్వారా కూడా వస్తుందని ఇటీవలే శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ వ్యాధి సోకితే నివారణే లేదు. కనుక ముందే రాకుండా జాగ్రత్తగా ఉండాలి. వ్యాధి మొదటి దశలో గార పట్టినట్లు పండ్లు పచ్చగా కనిపిస్తాయి. తరువాత ఎముకలు మెత్తబడి పెళుసుబారి పోతాయి. కాళ్లు, చేతులు వంకర్లు పోతాయి. వెన్నెముక వంగిపోయి నిటారుగా నిలబడలేరు. సరిగా నడవలేరు. కూర్చోలేరు. ఏ పనీ చేయలేరు. వ్యాధి తీవ్రమైతే మంచంలోంచి లేవలేరు కూడా. బతికున్నా శవంతో సమానం. ఇంతే గాదు తాతయ్యా. దీని వల్ల మధుమేహం, నరాల బలహీనత, కండరాలు క్షీణించిపోవడం, జీర్ణకోశ వ్యాధులు, గుండె జబ్బులు కూడా వస్తాయి. ఒక దశ దాటిన తర్వాత మూత్రపిండాలు కూడా పాడైపోతాయి. కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం, వికారం, ఆకలి మందగించడం, నీళ్ల విరేచనాలు, విరేచనంలో రక్తం పడడం వంటి జబ్బులు కూడా వస్తాయి.

తాత: అబ్బో... ఎంత ప్రమాదమో... నిజవేరా మనవడా. పాపం అవిరేని వెంకయ్య మన బజారు వాడేగా. కాళ్లు, చేతులు వంకర్లు పోయి, రెండు చేతుల్లో రెండు కట్టెలు పట్టుకుని గంటకో అడుగేస్తుంటాడు. ఈ వ్యాధి మనూళ్లో మరింకెవ్వరికీ రాకుండా

చూడాల్రా. అందుకు మనవేం చేయాల్నో చెప్పు.

మనవడు: ఈ వ్యాధికి విరుగుడు కాల్షియం, మెగ్నీషియం, సి విటమిన్ ఉన్న పదార్థాలని ఎక్కువగా తీసుకోవాలి. అంటే పాలు, గ్రుడ్లు, తోటకూర, కరివేపాకు, మునక్కాయలు బాగా కాల్షియాన్ని అందిస్తాయి. అంతేగాదు విటమిన్ సి ఎక్కువగా ఉన్న చింతపండు, ఉసిరికాయ, టమాట, పచ్చిమిర్చిలను అధికంగా తీసుకోవాలి. దాంతోపాటు కలుషితం కాని నది, వాగు, చెరువు నీళ్లను మంచి నీళ్లగా ఉపయోగించుకోవాలి.

తాత: భలే చెప్పావురా మనవడా. మీ నాయనమ్మ బెల్లం వేసి, పచ్చి పులుసు భలే రుచిగా చేస్తుందిరా. అది అన్నంలో కలుపుకుంటే అమృతమేననుకో. రోజుకొక్కసారైనా పచ్చిపులుసు నాలిక మీద పడందే నాకు అన్నం సయించదురా.


మనవడు: నువ్వు సి విటమిన్ ఉన్న పచ్చి పులుసు, కాల్షియం ఉన్న బెల్లం తీసుకోబట్టే ధృడంగా ఉన్నావు. నీకు ఫ్లోరోసిస్ వ్యాధి సోకలేదు. వర్షాలు తగ్గినకొద్దీ భూమి పొరల్లోని ఫ్లోరోసిస్ శాతం పెరుగుతుంది. మన జిల్లాల్లోని కొన్ని మండలాల్లో 8.85 పిపిఎంగా కూడా వుంది.

తాత: విషపు నీళ్లన్న మాట. అందుకేనా నువ్వు చెట్టుని కొట్టనీయలేదు.

మనవడు: అవును తాతయ్య మన జిల్లాలో అడవులు 30 శాతం ఉండాలి. కానీ 6 శాతమే ఉన్నాయి. దీనివల్ల మన జిల్లా అర్థ ఉష్ణమండలం నుంచి, ఉష్ణమండలంగా మారిపోతోంది. మన జిల్లాలో చాలా చోట్ల పల్లేర్లు, బ్రహ్మజెముళ్లు మొలుస్తున్నాయి.

తాత: జిల్లా ఎడారి కావడానికి దగ్గరౌతుందన్న మాట. ఓరే. ఎండ దెబ్బకు సాలా మంది మరణమై పోతుండ్రు. తలుచుకుంటేనే భయమేస్తుందిరా.

మనవడు: అంతేకాదు తాతయ్యా.. నదీ జలాల్ని పొదుపుగా వాడుకోవాలి. ఇంకుడు గుంతలు తవ్వి వర్షపు నీటిని భూమిలో దాచిపెట్టాలి. భూగర్భ జలాలు పెరిగితే



ఫ్లోరిన్ తగ్గుతుందన్న మాట.

తాత: సరే. సాలా మంచి సంగతులు చెప్పావు. ఇంక ముందు నేను ఏ చెట్టునూ కొట్టను గాక కొట్టను. ఇంటికి పోయి, ఈ సంగతులన్నీ మన ఊరి జనాన్ని పోగేసి పూసగుచ్చినట్లు సెప్పాల. మీ నాయనమ్మ నీ కోసం పాలు, నా కోసం టీ చేసి ఎదురు చూస్తుంటుంది పద.

మనవడు: నువ్వింక టీ తాగనని మాటివ్వాలి తాతా.

తాత: (నవ్వుతూ) ఎందుకురో. కొంపదీసి, టీలో కూడా ఫ్లోరిన్ ఉందా ఏంది?

మనవడు: అవును తాతయ్య. మనం తాగే టీలో ఒక మిల్లీగ్రాము ఫ్లోరిన్ ఉంది. రోజూ ఎక్కువ మొత్తంలో టీ తాగే వాళ్లకు ఈ ఫ్లోరోసిస్ వ్యాధి వచ్చే అవకాశముంది. కాబట్టి పాలు, లేదా మజ్జిగలే తీసుకోవాలి.

తాత: టీ తాగందే నా బుర్ర పనిచేయదు గదరా. సరే... నీ కోసం మానేస్తాలేరా. అవునోరే... అడగడం మరిచిపోయా. ఈ సంగతులన్నీ నీకు ఎవురు చెప్పార్రా?

మనవడు: మా బడికి ఇవ్వాళ్ల కలక్టర్ గారు పంపిన ఒక బృందం వచ్చింది తాతయ్యా. అందులో డాక్టర్లు, రచయితలు, కళాకారులు, సామాజిక సేవా కార్యకర్తలు ఉన్నారు. వీళ్లు ప్రతి పాఠశాలకు వెళ్లి పిల్లలకు ఈ సంగతులన్నీ నేర్పిస్తున్నారు. రాబోయే తరాల్లో ఒక్కరికి కూడా ఈ ఫ్లోరిన్ వ్యాధి రాకుండా కాపాడాలని చెబుతున్నారు.

తాత: ఆ దొర కడుపు సల్లగుండ. కలకటేరు మంచి పనే సేస్తుండరా. మన జిల్లాలో ఫ్లోరిన్ రాక్షసిని తరిమేయడానికి కంకణం కట్టుకుండన్న మాట. ఒరే... ఈ వ్యాధిని రూపుమాపడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, మేధావులు అంతా ఉద్యమంలా కదిలారు గదా.

మన వంతుగా ఇప్పుడే ఒక మంచి పని చేద్దాంరా. మన చేనుకు ఒక మూలన పెద్ద ఇంకుడు గుంతను తవ్వుదాం. అంతే గాదురోరే. చెరి ఒక మొక్కను నాటి మన గ్రామ ప్రజలకు ఆదర్శంగా ఉందాం.

మనవడు: నువ్వు నాకు నచ్చావు తాతయ్యా. (బుగ్గ మీద ముద్దు పెట్టుకుంటాడు. గొడ్డలిని తిప్పి, కర్రతో మొక్కను నాటడానికి గుంతను తవ్వుతారు. చెరో మొక్కను నాటుతుండగా తెర.)

– పుప్పాల కృష్ణమూర్తి
m : 99123 59345
బొమ్మలు : కైరంకొండ బాబు

## ఉపాధ్యాయులకు విజ్ఞప్తి




బాల చెలిమిలో గత కొన్ని నెలలుగా పిల్లల నాటికలను ప్రచురిస్తున్నాం ఇక ముందు కూడా ప్రచురించే ప్రయత్నం చేస్తాం. నాటికలు దృశ్య రూపాలు మీ పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రదర్శన ఇప్పించండి. ప్రదర్శన వివరాలు, దర్శకత్వం, ప్రదర్శన ఫోటోలు, నటీనటుల పేర్లు, ఫోటోలు పంపితే బాల చెలిమిలో ప్రచురిస్తాం. సాహిత్య రంగంలో మీరిస్తున్న ప్రోత్సాహం దృశ్య రంగంలో కూడా ఇచ్చి పిల్లల్లోని నటనా సామర్థ్యానికి మెరుగులు దిద్దవలసిందిగా కోరుతున్నాం.

– బాలచెలిమి డెస్క్

పంచతంత్ర కథలు

# మూడు చేపల కథ



ఒక కొలనులో చాలా చేపలు ఉండేవి. వాటిలో మూడు చేపలు చాలా సఖ్యంగా ఉండేవి. వాటి పేర్లు దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు. దీర్ఘదర్శి రాబోయే సమస్యల్ని, ప్రమాదాల్ని ముందుగానే పసిగట్టి, బయటపడే ఉపాయాన్ని ఆలోచించేది. ప్రాప్తకాలజ్ఞుడు అప్పటికప్పుడు, సమయస్ఫూర్తితో, ఏదో ఒక ఉపాయంతో తప్పించుకునేది. దీర్ఘసూత్రుడు ఏదో ఒకటి జరుగుతుందిలే అని ఊరుకునేది.

ఒకసారి అనావృష్టి వల్ల చాలా కాలం వానలు కురవలేదు. కొలనులో నీరు తరిగిపోవడం మొదలుపెట్టింది. అది గమనించిన దీర్ఘదర్శి తన ఇద్దరు మిత్రులతో, "కొలనులో నీరు ఇంకా తగ్గిపోతే చేపలవాళ్లు మనల్ని సులభంగా పట్టుకుంటారు. అందుకని ఇప్పుడే బాగా నీరున్న వేరే కొలనుకి వెళ్లిపోదాం" అని చెప్పింది. ప్రాప్తకాలజ్ఞుడు "ఇక్కడ ఎంతో సుఖంగా ఉంది. చేపలవాళ్లు వచ్చినప్పుడు ఏదో ఒక ఉపాయంతో తప్పించుకోవచ్చులే!" అని దాటవేసింది. దీర్ఘసూత్రుడు కూడా ప్రాప్తకాలజ్ఞుడినే సమర్థించింది.

తన మిత్రులతో ఉంటే ప్రమాదం తప్పదని నిశ్చయించుకుని, దీర్ఘదర్శి ముందుగానే ఆ కొలనులోకి ప్రవేశించే ఒక కాలువకు ఎదురీది వేరే పెద్ద కొలనుకు సురక్షితంగా చేరుకుంది. అక్కడ దానికి ఎటువంటి అపాయము లేదు. ఊహించినట్టుగానే కొలనులో నీటిమట్టం బాగా తగ్గిపోయింది. జాలరులు రానే వచ్చారు. వలలు వేసి చేపల్ని పట్టసాగారు. ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు ఇద్దరూ వలలో పడిపోయారు. ప్రాప్తకాలజ్ఞుడు తాను ప్రమాదంలో చిక్కుకున్నట్లు గ్రహించి చచ్చినట్టు నటించసాగింది. జాలరులు వలను పైకి లాగినప్పుడు దాని చూసి చచ్చిన చేప కదా అనుకుని ఒడ్డుకు విసిరేశారు. జాలరులు వేరే చేపల్ని పడుతున్నప్పుడు ప్రాప్తకాలజ్ఞుడు చల్లగా నీటిలోకి జారుకుని అక్కడ నుంచి పారిపోయింది. దీర్ఘసూత్రుడు వలలో చిక్కుకుని కొట్టుకసాగింది. జాలరులు దాన్ని పట్టి తీసుకుపోయారు.

**నీతి : సమస్యలను ముందుగానే తెలుసుకోగలిగే బుద్ధిని అలవరచుకోవడం ఉత్తమం. లేకపోతే ప్రమాదం నుండి బయటపడే సమయస్ఫూర్తి అయినా ఉండాలి. ఆ రెండూ లేనివాడికి నాశనం తప్పదు.**

సేకరణ : అమరావతి

పంచ భూతాలు

# గాలి



గాలి లోన ఉందును
ప్రాణ వాయువు
గాలి పీల్చి నిలుచును
జీవి ఆయువు
తిండి లేక కొన్నాళ్ళే
బతకగలము
గాలి లేక క్షణాలైన
బతికి ఉండము

– బెలగాం భీమేశ్వరరావు
m : 99895 37835



యాత్ర


# కొండపల్లి కోటను చూద్దాం... కొండపల్లి బొమ్మలు తెచ్చుకుందాం...

కొండపల్లి అనగానే మనకు గుర్తొచ్చేవి కొండపల్లి బొమ్మలు. నిర్మల్ పెయింటింగ్స్, కొండపల్లి బొమ్మలు ప్రపంచ ఖ్యాతిని పొందాయి. ఇవి అన్ని హస్తకళల విక్రయ కేంద్రాల్లోనూ, వివిధ పర్యాటక ప్రాంతాల్లోనూ, ఆధ్యాత్మిక కేంద్రాల్లోనూ లభ్యమవుతాయి. కొండపల్లి బొమ్మలకు పురాతన చరిత్ర ఉంది. 17వ శతాబ్దపు రాజస్థానీ బొమ్మల శైలికి, ఈ బొమ్మల శైలికీ ఉన్న సారూప్యతను బట్టి రాజస్థాన్ కళాకారులు ఇక్కడికి వలస వచ్చారని భావిస్తున్నారు. గత నాలుగు వందల సంవత్సరాలుగా ఈ బొమ్మల తయారీ ఇక్కడ జరుగుతుంది. ఈ బొమ్మలు చేసే కళాకారులను ఆర్యక్షత్రియులు అంటారు. ఈ బొమ్మలను తేలికైన పొనికి చెక్కతో తయారు చేస్తారు. ముందుగా చెక్కమీద తయారు చేయవలసిన బొమ్మ ఆకారాన్ని చెక్కుతారు. తరువాత రంపపు పొట్టు, చింతగింజల పొడితో కావాలసిన ఆకారంలో మలుస్తారు. బొమ్మలకు ప్రత్యేకంగా వేరే అతకవలసిన భాగాలు, మార్పులు చేస్తారు. తరువాత వాటికి సున్నంపూసి ఎండబెడతారు. ఆ తరువాత ఆరిన సున్నంపై అవసరమైన నాణ్యమైన రంగులు పూస్తారు. కొండపల్లి బొమ్మలలో ఏనుగు అంబారి మావుటివాడు, నాట్యం చేస్తున్న నృత్యకళాకారిణుల బొమ్మ, గ్రామీణ జీవన వ్యవస్థ ప్రతిరూపాలైన తలపాగా, పంచె కట్టుకున్న పురుషులు, చీరెలు కట్టుకున్న స్త్రీల బొ్మలు, పక్షులు జంతువులు, పండ్లు, కూరగాయలు, ఇళ్లు బొమ్మలు ప్రత్యేక గుర్తింపును పొందాయి. ఒకసారి చేసిన బొమ్మను మూసగా పోసి మరో బొమ్మను చేసే వీలులేదు. మొదటిది ఎంత సమయం, ఎంత కళాదృష్టి, ఎంత ఏకాగ్రతతో చేస్తారో ప్రతి బొమ్మనూ ప్రత్యేకంగా అలాగే చేస్తారు. ఇది ఆ కళాకారులకే స్వంతమైన పనితనం. బొమ్మల కొలువైన ఈ కొండపల్లి ఒక పురాతన, చారిత్రక ప్రాముఖ్యత కలిగిన పర్యాటక ప్రాంతం. ఇది విజయవాడ – హైద్రాబాద్ జాతీయ రహదారిలో విజయవాడకు 16 కి.మీ. దూరంలో ఉన్న ఇబ్రహీంపట్టణానికి దగ్గరగా ఉంటుంది. ఇక్కడ కొండమీద ఉన్న కోట క్రీ.శ. 1362–1377 కాలంలో అనవేమారెడ్డిచే నిర్మించబడిందని, కృష్ణదేవరాయులచే స్వాధీనం చేసుకుని విజయనగర సామ్రాజ్యంలో విలీనం చేయబడిందని చెబుతారు. ముసనూరి కమ్మరాజుల కాలంలో నిర్మితమైందని, తెలుగు వీరుడు ముసునూరి పోలయ నిర్మాణం చేపట్టగా అతని వారసుడు కాపయ కాలంలో పూర్తయిందని గుంటూరు జిల్లా కొల్లూరులోని శాసనం ద్వారా తెలుస్తుంది. ఈ కొండ చుట్టూ శత్రు దుర్భేద్యమైన ప్రాకారం, రాజమహల్ గోడలపై కళాఖండాలు, దర్బారు నిర్వహించే రాజమహల్, రాణీమహల్, నర్తనశాల, కారాగారాలు, ఆయుధాగారాలు, వివిధ కొలనులు, ఏనుగులు, గుర్రాలు సమూహంగా వెళ్లడానికి వీలుగా రహదారుల నిర్మాణం – ఇవన్నీ ఒక కొండపైనే ఉన్నాయి. ఈ కోట శిథిలాలు పర్యాటకులను ఇప్పాటికీ ఆకర్షిస్తున్నాయి. క్రీ.శ. 1767లో బ్రిటిష్ వారు ఈ కొండపల్లి కోటను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. 1962 నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలోకి వచ్చాక రక్షిత కట్టడంగా ప్రకటించారు. కొండపల్లి కోటకు వెళ్లేందుకు జూపుడిమీదుగా కొండ పైకి రోడ్డు మార్గం ఉంది. కొండపల్లి నుండి నడక మార్గం కూడా ఉంది. ఈ చుట్టు పక్కల వివిధ ఆలయాలు ఉన్నాయి. ఆయా సందర్భాలలో ఇక్కడ ఉత్సవాలు జరుగుతుంటాయి.

మనం మాత్రం కొండపల్లి కోటను చూద్దాం. కొండపల్లి బొమ్మల్ని తెచ్చుకుందాం.

**– జుగాష్ విలి**

బాలచెలిమి డెస్క్


కాబూలీ వాలా
కే. ఉషారెడ్డి
భారతదేశం వెళ్ళి తిరిగి వచ్చిన కాబూలీవాలా తన అనుభవాలు చెప్తూ...
ఇది ఆంధ్రదేశంలో 'రసాలు'గా పేరు పొందిన మామిడి పండు. ఆహా! దీనితో సాటి వచ్చే పండు మరేదీ లేదు
రసాల్...
నేను నమ్మను... ఇది బంగారమో, వజ్రమో అయి ఉంటుంది.
ఔను! ఇవి నిజంగా బంగారమే! మధురమైన, ఈ రసాన్ని తాగితే మీ మనసుకెంతో ఆహ్లాదం!
ఆల్‌బకరా పండ్లు, పంచదార నీళ్ళు కలిపి మామిడి రసం మాదిరిగా తయారు చేశాడు.
దానిలో తన గడ్డం ముంచాడు
ఒక్కొక్కరు వచ్చి నా గడ్డం చప్పరించారు.
ఓహో... ఏమి రుచి
ఒకరి తరువాత ఒకరు వచ్చి గడ్డం చప్పరించారు.
- చివరికి -
దేవుడోయ్... నా గడ్డం

క్రికెట్

# తొలిసారి టీ20 ప్రపంచ కప్ విజేతగా న్యూజిలాండ్...




మహిళల టీ20 ప్రపంచకప్ 2024 విజేతగా న్యూజిలాండ్ జట్టు నిలిచింది. 20.10.2024 జరిగిన ఫైనల్‌లో ఆ జట్టు దక్షిణాఫ్రికాను 32 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో తొలిసారి టీ20 ప్రపంచకప్‌ను దేశానికి అందించి చరిత్ర సృష్టించింది. ఇక పురుషుల టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో ఓడి.. టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచిన దక్షిణాఫ్రికా మరోసారి అదే పునరావృతం చేసింది. ఒత్తిడికి చిత్తయి ఫైనల్‌లో ఓడిపోయింది. 2024లో దక్షిణాఫ్రికా క్రికెట్ జట్లను దురదృష్టం వెంటాడుతోంది. పురుషుల టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్‌లో భారత్ చేతిలో ఓడి.. దక్షిణాఫ్రికా కప్పుకు దూరమైంది. తాజాగా మహిళల జట్టు కూడా ఫైనల్‌లో ఓడిపోయింది. మహిళల టీ20 ప్రపంచకప్ 2024లో న్యూజిలాండ్ చేతిలో ఓడి.. ఒకే ఏడాది రెండు ఫైనల్స్‌లోనూ ఓడిన దేశంగా నిలిచింది. ఇక పురుషుల జట్టుకు సాధ్యం కాని రికార్డును న్యూజిలాండ్ మహిళల టీమ్ సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 158/5 పరుగులు చేసింది. ఓ దశలో 13 ఓవర్లలో 85/3తో నిలిచింది న్యూజిలాండ్. దీంతో ఆ జట్టు కనీసం 130 పరుగులైనా చేస్తుందా అనిపించింది. కానీ చివరి ఏడు ఓవర్లలో ఆ జట్టు ఏకంగా 73 పరుగులు రాబట్టింది. 150 పరుగుల మార్కును దాటింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగినా.. ప్రత్యర్థి ముందు భారీ టార్గెట్ నిర్దేశించింది. ఈ ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా మహిళల జట్టు అత్యుత్తమంగా బ్యాటింగ్ చేసింది. ఫైనల్‌లోనూ ఛేజింగ్‌ను ఘనంగా ఆరంభించింది. ఓ దశలో ఆరు ఓవర్లు ముగిసే సరికి 47/0తో నిలిచింది. 51 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన ఆ జట్టు.. ఫైనల్ బలహీనతను మరోసారి బయటపెట్టింది. ఆ జట్టు 9 వికెట్ల నష్టానికి 126 పరుగులకు పరిమితమైంది. ఈ విజయంతో న్యూజిలాండ్ జట్టు తొలిసారి టీ20 ప్రపంచకప్ టైటిల్ అందుకుంది. ఆ దేశ పురుషుల జట్టు కూడా ఇప్పటివరకు టీ20 ప్రపంచకప్ టైటిల్ సాధించలేక పోయింది. మహిళల జట్టు కూడా 2009, 2010లో రన్నరప్‌గా నిలిచింది. పురుషుల జట్టు సైతం 2021లో ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. దీంతో తమ దేశానికి తొలి టీ20 ప్రపంచ కప్ అందించామనే ఆనందంలో కివీస్ మహిళలు సంతోషంగా కన్నీళ్లు పెట్టుకున్నారు.

– సచిన్ కోత్వాల్
బాలచెలిమి, m: 9701001036



## పెంచిన చెట్టు.. 37 మందిని కాపాడింది!

పై ఫొటోలో బోసినవ్వులు చిందిస్తున్న వ్యక్తి పేరు ఎపిమాకో అమాన్‌చియో. ఫిలిప్పీన్స్‌కు చెందిన ఆయన ఊళ్లో మొక్కలు నాటుతుండేవారు. 2010లో 37 మంది విద్యార్థులతో వెళ్తున్న ఓ బస్సు, ఆ ఊరి లోయలో పడకుండా ఎపిమాకో నాటిన ఓ చెట్టు కాపాడింది. దాన్ని ఆయన 1975లో నాటడం విశేషం. ఆ సమయంలో తను నాటిన చెట్టు ముంగిట నిల్చుని పెద్దాయన తీసుకున్న ఫొటో ఇది.




Bookmobile in Virginia, 1950s


పాట

# కోడీ కోడీ - కొక్కొరోకో!



కోడీ కోడీ - కొక్కొరోకో!
కాకీ కాకీ - కావ్ కావ్!
తెల్లవారింది
తెలివి వచ్చింది
అమ్మ లెమ్మంది
ఆడుకొమ్మంది

– పిల్లల పాటల పరిమళం
తెలంగాణ సారస్వత పరిషత్తు



# జాలరి - బంగారు చేప

## అలెగ్జాండర్ పుష్కిన్

అనగనగా ఓ సముద్రపు ఒడ్డున ముసలి దంపతులు చిన్న గుడిసెలో నివసించేవారు. వాళ్ళు చాలా పేదవాళ్ళు. వాళ్ళు ముప్పై మూడు వేసవి కాలాలు, ముప్పై మూడు శీతాకాలాలు అక్కడే జీవించారు. ఈ మూడు దశాబ్దాల కాలంలో, ముసలాయన చేపలు పడుతూ ఉండేవాడు. ముసలావిడ ఇంటి పనులు చేసుకోవటం, వలలు అల్లడం, పాడైపోయిన వలల్ని బాగు చేయటం చేసేది.

ఒకరోజు ముసలాయన చేపల వేటకై, వలని సముద్రంలోకి వదిలాడు. పైకి లాగి చూసేసరికి, వలంతా బురద మట్టి మాత్రమే ఉంది. చేపలేమీ పడలేదు.

రెండోసారి వలని సముద్రంలోకి వదిలాడు. ఈ సారి వల కొంచెం చిరిగింది. కాని చేపల జాడలేదు.

మూడోసారి వలని సముద్రంలోకి వదిలాడు. ఈ సారి వలలో ఒకే ఒక చేప పడింది. అది సాధారణమైన చేప కాదు. దేదీప్యమైన కాంతితో మెరిసిపోతున్న 'బంగారు చేప'.

బంగారు చేప ఇలా బ్రతిమలాడింది "ఓ ముసలాయనా! నన్ను సముద్రంలో వదిలెయ్యి. నీకెంత డబ్బు కావాలన్నా ఇస్తాను. నువ్వు ఏ వరం కావాలన్నా ఇస్తాను.

ఇది విన్న ముసలాయన ఆశ్చర్యపోయి, భయపడ్డాడు. ఎందుకంటే తను ముప్పై సంవత్సరాలుగా చేపల వేట సాగిస్తున్నాడు. మాట్లాడే చేప ఇంతవరకు అతడి కంటబడలేదు. అతడు జాగ్రత్తగా బంగారు చేపను బయటకు తీసి ఇలా అన్నాడు.

"ఓ బుజ్జి బంగారు చేపా! నువ్వు ఇస్తానన్న డబ్బు నాకొద్దు. నిన్ను సముద్రంలోకి వదులుతాను. జాగ్రత్తగా మీ ఇల్లు చేరు. స్వేచ్ఛగా హాయిగా జీవించు."

బంగారు చేపను సముద్రంలోకి వదిలాడు ముసలాయన. చేప ముసలాయనకు కృతజ్ఞతలు చెప్పి, నీలి సాగరంలో మాయమైంది.

ఇంటికెళ్ళిన ముసలాయన తన భార్యతో ఇలా అన్నాడు. "ఈ రోజు ఓ అద్భుతం జరిగింది. నా వలలో ఓ బంగారు చేప పడింది. దాన్ని వదిలితే, ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాను అంది. ఏ వరం కోరుకున్నా ఇస్తానంది. కానీ నేను జాలితో దాన్ని సముద్రంలో వదిలేసాను. డబ్బు, వరం రెండూ అడుగలేదు. చూడు నేనెంత మంచి పని చేసానో".

ముసలమ్మ ఆయనపై తిట్ల దండకం మొదలు పెట్టింది. "ఓరి అమాయకుడా! వెర్రిబాగులోడా! బంగారపు చేప డబ్బు కోరుకోమంటే వద్దన్నావు. వరం కోరుకోమంటే వద్దన్నావు. పాత్ర అయినా అడగాల్సింది కదా! మన ఇంట్లో ఉన్న పాత్ర ఇప్పటికే పాడయింది గదా!"

సరే అని ముసలాయన సముద్ర తీరానికి వెళ్ళాడు. సముద్రపు అలలు ప్రశాంతంగా కదులుతున్నాయి. చేపని బిగ్గరగా పిలిచాడు.

బంగారు చేప ఈదుకుంటూ వచ్చింది. "ఏంటి ముసలాయన పిలిచావ్! ఏం కావాలి?" అని అడిగింది. ముసలాయన ఇలా అన్నాడు.

"గౌరవనీయులైన బంగారు చేపగారు! నన్ను క్షమించండి. నా భార్య నన్ను చెడా మడా తిట్టింది. మా ఇంట్లో ఉండే పాత్ర పాడైపోయింది. కాబట్టి చేపలు బట్టలు ఉతికే కొత్త పాత్రను తను కావాలంటోంది."

బంగారు చేప ఇలా జవాబిచ్చింది "బాధపడకు,

ఇంటికి వెళ్ళు, భగవంతుడు నీతోనే ఉంటాడు. నీవు కోరుకున్న వంటపాత్ర నీకు లభిస్తుంది."

ముసలాయన తిరిగి ఇంటికి వెళ్ళాడు. అక్కడ ఓ కొత్త పాత్ర ఉంది ముసలామె దాన్ని చూసి ఆనందించక పోగా, ఇలా తిట్టడం మొదలు పెట్టింది

"ఓ అమాయకుడా! వెర్రిబాగులోడా! వంటపాత్రని ఏం చేసుకుంటాము? తిరిగి బంగారు చేప వద్దకు వెళ్ళి, ఓ మంచి ఇల్లు కావాలని ప్రార్థించు."

ముసలాయన తిరిగి సముద్ర తీరానికి వెళ్ళాడు. ఈ సారి సముద్రపు అలలు కొంచెం అలజడిగా కనిపించాయి. బంగారు చేపని బిగ్గరగా పిలిచాడు.

బంగారు చేప ఈదుకుంటూ వచ్చింది. "ఏంటి ముసలాయన పిలిచావ్! ఏం కావాలి నీకు?" అని అడిగింది.

ముసలాయన ఇలా అన్నాడు. గౌరవనీయులైన బంగారు చేపగారూ! నన్ను క్షమించండి. నా భార్య నన్ను మరలా తిట్టింది. తనకి ఉండటానికి మంచి ఇల్లు కావాలంట".

బంగారు చేప ఇలా జవాబిచ్చింది. "బాధపడకు, ఇంటికి వెళ్ళు, భగవంతుడు నీతోనే ఉంటాడు. నీవు కోరుకున్న మంచి ఇల్లు నీకు లభిస్తుంది."

ముసలాయన తిరిగి ఇంటికి వెళ్ళాడు. ఆశ్చర్యం! గుడిసె స్థానంలో ఓ మంచి ఇల్లు ఉంది. అది ఇటుకలతో కట్టినది, చెక్క కిటికీలు ఉన్నాయి. ప్రహరీ గోడ కూడా ఉంది. ఓ కిటికీ వద్ద తన భార్య కూర్చుని ఉంది. ముసలాయనని చూడగానే ఆమె ఇలా తిట్టడం మొదలు పెట్టింది. "ఓ అమాయకుడా! వెర్రిబాగులోడా! మంచి ఇల్లు ఉంటే సరిపోతుందా! నాకు ఈ పేదరికం వద్దు. గృహిణిగా ఉండి అలసిపోయాను. నేను డబ్బున్న యజమానురాలిని కావాలనుకుంటున్నా, కాబట్టి నువ్వు తిరిగి వెళ్ళి, బంగారు చేపని నా కోరిక కోసం ప్రార్థించు."

ముసలాయన తిరిగి సముద్ర తీరానికి వెళ్ళాడు. ఈసారి సముద్రం భీకరంగా నురుగులు కక్కుకుంటూ ఉగ్రంగా కనిపించింది. బంగారు చేపని బిగ్గరగా పిలిచాడు.

బంగారు చేప ఈదుకుంటూ వచ్చింది. "ఏంటి ముసలాయన పిలిచావ్! మళ్ళీ ఏం కావాలి నీకు?" అని అడిగింది. ముసలాయన ఇలా అన్నాడు."

"గౌరవనీయులైన బంగారు చేపగారూ! నన్ను క్షమించండి. నా భార్య నన్ను మరలా తిట్టింది. తను డబ్బున్న యజమానురాలు కావాలనుకొంటోంది. ఇల్లంతా నౌకర్లు, సేవకులు కావాలంది."

బంగారు చేప ఇలా జవాబిచ్చింది. "బాధపడకు, ఇంటికి వెళ్ళు, భగవంతుడు నీతోనే ఉంటాడు. నీ కోరిక నెరవేరుతుంది."

ముసలాయన తిరిగి ఇంటికి వెళ్ళాడు. తన ఇల్లు స్థానంలో ఓ పాలరాతి భవనం ఉంది. తన భార్య తెల్లటి మెట్లపై నిల్చుని ఉంది. ఆమె చుట్టూ సేవకులు, నౌకర్లు వినయంగా నిల్చున్నారు. ఆమె చాలా ఖరీదైన బట్టలు ధరించి ఉంది. మెడలో ముత్యాల దండలు మెరుస్తూ ఉన్నాయి. చేతి వేళ్ళకు బోల్డెన్ని ఉంగరాలు ఉన్నాయి. ఆమె తీరు వేరేగా ఉంది.

"ఇపుడు నీ కోరికలు తీరినట్లే కదా" అన్నాడు ముసలాయన. పోయి నీ పని చూసుకో అని విసుక్కుంది. యజమానురాలిలా మారిన ముసలావిడ.

మెల్లగా ఓ వారం గడిచింది. మరో వారం గడిచింది. ముసలామె గర్విష్టిగా మారిపోయింది. ఓ రోజు తన భర్తతో ఇలా అంది. నాకు యజమానురాలిగా ఉండటం అంత ఆసక్తిగా అనిపించటం లేదు. నాకు ఈ దేశానికి రాణి కావాలనుంది. నీవు సముద్ర తీరానికి వెళ్ళి, బంగారు చేపను ప్రార్థించి నా కోరిక నెరవేరేలా చూడు."

ముసలాయన చేపని తిరిగి ప్రార్థించాడు.

బంగారు చేప ఇలా జవాబిచ్చింది. "బాధపడకు, ఇంటికి వెళ్ళు, భగవంతుడు నీతోనే ఉంటాడు, నీ కోరిక నెరవేరుతుంది".

ముసలాయన ఇంటికి వెళ్ళాడు. తన ఇంటి స్థానంలో ఓ రాజభవనం వెలిసింది. తన భార్య 'రాణి'లా సింహాసనం పై ఠీవీగా కూర్చుని ఉంది. కత్తులు, బల్లేలు పట్టుకుని సైనికులు ఆమెకు కాపలాగా ఉన్నారు. పట్టణ పుర ప్రముఖులు వినయంగా ఆమె వద్ద నిలుచుని



ఉన్నారు.

ముసలాయన ఒంగి నమస్కరించాడు. "రాణి గారు! నమస్కారం. మీ కోరికలన్నీ నెరవేరాయని ఆశిస్తున్నాను" అన్నాడు.

అతని మాటలు రాణి పట్టించుకోలేదు. ముసలాయన్ని తన్ని తరిమేయండి అని ఆజ్ఞాపించింది. భటులు ముసలాయన్ని కొట్టి, రాజ ప్రసాదం నుండి బయటకు గెంటివేసారు.

మెల్లగా ఓ వారం గడిచింది. మరో వారం గడిచింది. ముసలామెకు ఎక్కడ లేని గర్వం, పొగరు అలవాటయ్యాయి. ముసలాయనని తీసుకురమ్మని ఆదేశించింది. సైనికులు పట్టణం అంతా వెతికి ముసలాయనని పట్టుకున్నారు. రాణి ముందు ప్రవేశ పెట్టారు. ఆమె ఇలా అంది.

"నాకు పట్టణానికి రాణిగా ఉండటం ఆసక్తిగా అనిపించటం లేదు. ఆ నీలి సముద్రం మధ్యలో నాకో రాజ భవనం కావాలి. నేను సముద్రానికి రాణిని కావాలి. ఆ బంగారు చేప నా సైనికుడు అవ్వాలి. నా ఆజ్ఞలు శిరసావహించి, నేను ఏది కోరుకుంటే అది నాకు దక్కేలా చూడాలి, కాబట్టి నువ్వు సముద్రం వద్దకు వెళ్ళి బంగారు చేపని క్షమాపణలు అడిగి, నా కోరిక నెరవేరేలా ప్రార్థించు."

ఇది విన్న ముసలాయన హతాశుడయ్యాడు. ఒక్క మాట కూడా తిరిగి మాట్లాడలేదు. బాధగా సముద్రం వైపు పయనమయ్యాడు.

సముద్రం అల్లకల్లోలంగా ఉంది. అలలు ఉగ్రంగా ఎగసి ఎగసి పడుతున్నాయి. బంగారు చేపని బిగ్గరగా పిలిచాడు.

బంగారు చేప ఈదుకుంటూ వచ్చింది. "ఏంటి ముసలాయన పిలిచావ్! ఏం కావాలి?" అని అడిగింది. ముసలాయన ఇలా అన్నాడు.

"గౌరవనీయులైన బంగారు చేపగారూ! నన్ను క్షమించండి. దుర్బుద్ధి గల నా భార్యను ఏం చేయమంటారు. ఆమెకు పట్టణపు రాణిగా ఉండటం ఆనందం ఇవ్వటం లేదట. ఈ సముద్రంలో ఓ రాజ భవనం కావాలట. ఈ సముద్రానికి ఆమె రాణి కావాలట. మీరు ఆమెకు సేవకుడిగా పని చేస్తూ ఆజ్ఞలు పాటిస్తూ ఆమె కోరిన కోరికలన్నీ తీర్చాలంట."

బంగారు చేప ఏమి మాట్లాడలేదు. అది దాని తోకను ఊపుతూ సాగరగర్భంలో మాయమైంది. బంగారు చేప సమాధానం కోసం ఎదురు చూసాడు ముసలాయన. చివరకి పట్టణంలోని రాణి కోటవైపు బయలుదేరాడు.

ఆశ్చర్యం! తీరా అక్కడ చూస్తే తన పాత పూరి గుడిసె ఉంది. చిరిగి మాసిపోయిన బట్టలతో తన భార్య ఉంది. ఆమె ముందు విరిగిన పాత పాత్ర ఉంది.


స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**

m : 8179273974


ఇంగ్లీష్ : ది ఫిషర్ మ్యాన్ అండ్ ది గోల్డ్ ఫిష్

రైటర్ : అలెగ్జాండర్ పుష్కిన్

ఇంగ్లీష్ అనువాదం : లూయిస్ జెల్లీకోఫ్

బొమ్మ : బోరిస్ డెక్తెర్యోవ్

రష్యన్ జానపద కథల నుండి

కథ


# లీడర్

స్నేహకు పదేళ్ళు నిండాయి. ఈ మధ్య తనకు మన దేశం గురించి, వార్తా విశేషాల గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి పెరిగింది. ఈ మధ్యే జరిగిన ఎన్నికలు కూడా ఒక కారణం. వాళ్ళ ఊరిలో పోటీ చేసే వ్యక్తుల ప్రచారాలు, టీవీల్లో ఎన్నికల వార్తలు ఆమెకు కొంత కుతూహలాన్ని కలిగించాయి. ఉదయం లేవగానే తాతయ్యతో వార్తాపత్రిక చదవడం మొదలుపెట్టింది. బడికి తీసుకెళ్తూ నాన్న కారులో వచ్చే ఎఫ్.ఎం రేడియో వార్తలు కూడా ఆసక్తిగా అనిపిస్తున్నాయి. ఇప్పటికి దాకా తన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఇన్ని విశేషాలు ఉంటాయని అనుకోలేదు.

వాళ్ళ ఊరికి కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యే వచ్చాడు. ఊరిని పెద్ద పండుగ లాగా అలంకరించి జనం ఆయనకి స్వాగతం పలికారు. అదంతా చూసి స్నేహ చాలా ఆశ్చర్యపోయింది. తాతయ్యను అడిగితే "వాళ్ళు మన మంచిచెడులు చూసే నాయకులు" అని చెప్పాడు. తను కూడా పెద్దయ్యాక అలాంటి నాయకత్వం వహించి ప్రజల బాగోగులు చూడాలని సంకల్పించింది.

బళ్ళో తనకిష్టమైన రాధ టీచర్‌తో చెప్పింది. రాధా




టీచర్ స్నేహ ఆలోచనను మెచ్చుకున్నారు. స్నేహకు ఒక అవకాశం ఇవ్వాలని క్లాస్ లీడర్‌గా నియమించారు. ఇప్పుడు స్నేహ తన తరగతికి నాయకురాలు! తన తోటి వాళ్ళంతా తనను లీడర్ అని పిలుస్తూ, వాళ్ళ ఫిర్యాదులు, సందేహాలు అన్నీ చెప్తుంటే స్నేహకు చాలా సంతోషంగా ఉంది. ఒక రోజు తన తోటి విద్యార్థి నవీన్ దిగులుగా ఉండటం గమనించింది. ఎప్పుడూ హుషారుగా ఉండే నవీన్ ఈ రోజు ఎందుకలా ఉన్నాడా అనుకుంది. కానీ అతనిని అడగలేదు. మర్నాడు కూడా నవీన్ అలాగే ఉన్నాడు. స్నేహ కారణం ఏంటని అడిగింది. నవీన్ మౌనంగా ఉన్నాడు కానీ అతని కళ్ళు ఏడ్చినట్టుగా ఉన్నాయి. అతను బాధలో ఉన్నాడని అర్థం అయింది. స్నేహ వెంటనే రాధా టీచర్ దగ్గరకు వెళ్ళి నవీన్ గురించి చెప్పింది. రాధా టీచర్ నవీన్ ను పిలిచి మాట్లాడారు. తరువాత నవీన్ మొహంలో బాధ కనిపించలేదు. రాధా టీచర్ స్నేహను పిలిచి "నువ్వు నాయకురాలివి అవుతానంటే చాలా ఆనందమనిపించింది. నీలో నాయకత్వ లక్షణాలను పరీక్షించడానికే నిన్ను క్లాస్ లీడర్‌గా ఉండమన్నాను. నువ్వు నీ తోటి విద్యార్థుల మంచిచెడులు చూసే బాధ్యత తీసుకున్నావు. నాయకత్వం అంటే అధికారంతో తీసుకునే బాధ్యత. నువ్వు నాయకురాలివి అవుతావు" అంటూ అభినందించారు.

– డా. హారిక చెరుకుపల్లి
m : 90005 559913





# తెలంగాణా ఎత్తిపోతల జలపాతం

ఈ ఎత్తిపోతల జలపాతం మూడు జలపాతాల సముదాయం. తూర్పు నుంచి పడమర వైపు వడివడిగా ప్రయాణిస్తున్న వాగు మూడు పాయల జలపాతంగా మారగా, దీనికి కుడివైపు నుంచి జలజల పారుతున్న ఒక ఏరు మొదటి జలపాతం ప్రవాహంలోకి దూకుతున్నది. ఈ రెండు జలపాతాలు కలిసిపోయి ఒకే ప్రవాహంగా మారి ఎత్తైన మట్టి గుట్టల మధ్య ప్రవహించి, అక్కడ ఒక చదునైన 30 మీటర్ల పొడవైన బండ మీది నుంచి 40 అడుగుల లోతున లోయలోకి దూకుతుంది. పచ్చని ఇరుకైన లోయలో కన్పించే ఈ దృశ్యం కన్నుల పండువగా ఉంటుంది. ఈ జలపాతం అంచునే కర్ణాటక రాష్ట్రం ఉంది.

ఈ ప్రాంతపు మట్టి గుట్టల మధ్య చిక్కుకు పోయినట్లు కనిపించే చెరువు, భూమినుంచే ఇటుక రాళ్ళను చెక్కుకొని వాటితోనే ఇళ్ళు కట్టుకోవడం, మెట్ట పంటలు, చిన్న చిన్న లంబాడి తండాలు... ఈ విశేషాల మధ్య చేసే ప్రయాణం ఆసక్తికరంగా ఉంటుంది. ఆసక్తి, సమయం ఉన్నవారు పక్కనున్న మొగ్దంపల్లి మీదుగా పది కిలోమీటర్ల దూరం ప్రయాణించి గొట్టంగుట్ట అనే మరో పర్యాటక స్థలాన్ని దర్శించవచ్చు. హైదరాబాద్ నుంచి వెళ్ళేవారు దారిలో నందికందిలో నక్షత్రాకార శివాలయం (వేయేళ్ళనాటిది) చూడవచ్చు. దేశంలో మొట్టమొదటి శాస్త్రీయ పట్టణమైన సదాశివపేటను చూడవచ్చు.

మన రాష్ట్రంలో ఉన్న ఒకే ఒక ఆర్గానిక్ హోటల్ జహీరాబాద్‌లోనే ఉంది. కాబట్టి అక్కడ ఆర్గానిక్ ఫుడ్ లాగించేయొచ్చు. ప్రత్యామ్నాయంగా తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ వారి హరిత హోటల్ కూడా అక్కడే ఉంది.

ఈ ఎత్తిపోతల హైదరాబాద్‌కు సుమారు 110 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎటునుంచి వెళ్ళేవారైనా ముందు ముంబై రహదారిలో ఉన్న జహీరాబాద్‌కు రైలులోగాని, బస్సులోగాని, ప్రైవేటు వాహనంలోగాని చేరుకోవాలి. ఆ తరువాత పది కిలోమీటర్ల దూరం ప్రయాణానికి ప్రైవేటు వాహనదారులకు తప్ప మిగతా వారికి ఆటోలే శరణ్యం. జహీరాబాద్ రైల్వే ట్రాక్ దాటిన వెంటనే ఎడమ వైపుకి తిరిగి హోతి–బి, పర్వతాపూర్, ఉప్పు తండాలు దాటి ఎత్తిపోతలను చేరుకోవచ్చు.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 94909 57078

# పిచ్చుక



పిల్లలూ... మీరెప్పుడైన గిజిగాడి పిచ్చుక గూళ్లు చూసారా! ఉదయాన్నో, సాయంత్రమో మీ ఇంటి కిటికీ చువ్వ మీదనో, మీ ఇంటి ముంగిట ఉన్న ఏ చెట్టు మీద కొమ్మ నుంచో పిచ్చుకల కిచకిచలు విన్నారా... వాటి మెడ సొంపులు చూసారా... చూడకపోతే మీ అమ్మమ్మ తాతయ్య వాళ్ల ఊరు వెళ్లినప్పుడు పొలాల వైపు వెళ్లండి. ఏ ఈత చెట్టుకో వేలాడుతూ ఈ గిజిగాని గూడు కన్పించొచ్చు.

ఈ పిచ్చుకలు పేసరిడే కుటుంబానికి చెందిన చిన్న పక్షులు. ఇవి చిన్నగా బొద్దుగా గోధుమ, ఊదా రంగులో ఉండి చిన్న తోకతో పొట్టిగా ఉండే బలమైన ముక్కు కలిగివుంటాయి.

పిచ్చుకల్లో ఇంచుమించు 35 జాతులున్నాయి. వివిధ జాతుల మధ్య భేదాలు అల్పంగా ఉంటాయి. పిచ్చుకలు శరీర నిర్మాణంలో ఇతర గింజలను తినే పక్షుల లాగే ఉంటాయి. నాలుకలో ఒక ఎముక అధికంగా ఉంటుంది. పిచ్చుకలు ముఖ్యంగా గింజలను తింటాయి, కొన్ని చిన్న చిన్న క్రిమి కీటకాలను కూడా తింటాయి.

ఊళ్లలో పాడు పడిన బావులు, పూరిళ్ల కప్పు అంచులకు, తుమ్మచెట్లకు గూళ్లు కట్టుకుని సందడి చేసేవి. ఈ దృశ్యాలు ఎంతో చూడముచ్చటగా ఉండేవనడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

ప్రకృతి నేస్తం పిచ్చుక.. జీవ వైవిధ్యానికి ప్రతీక. పంట చేలల్లో రైతన్నలకు ఎదురుపడే ప్రాణులు. వాటికి ఆహారం అందించేందుకు రైతులు తమ ఇంటి చూరుకు వరి కంకులు కట్టేవారు. ఒక ఊరిలో పిచ్చుక కనిపిస్తే ఆ ఊరు పచ్చగా ఉన్నట్లు శాస్త్రీయపరంగా ఓ అంచనా. పక్షులు కనిపిస్తున్నాయంటే ఆ ఊరిలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నట్లు. పంటలు బాగా పండుతున్నట్లు.

నాడు పంట చేలు, ధాన్యపు రాశుల వద్ద కిచలకిచలమంటూ పిచ్చుకలు సందడి చేసేవి. మనిషి అలికిడి వినగానే అక్కడి నుంచి తుర్రుమంటూ ఎగిరిపోయేవి. ఆడ పిచ్చుక గుడ్లు పెడుతుంది. పొదుగుతుంది. నోటితో ఆహారాన్ని తీసుకువచ్చి స్వయంగా పిల్లలకు అందిస్తుంది. రెక్కలొచ్చి ఎగిరేవరకూ వాటి బాగోగులు చూసుకుంటుంది. పిచ్చుక తల్లి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుంది.

జీవనశైలిలో పెనువేగంగా వచ్చిన మార్పే 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం'గా మారింది. పిచ్చుక జాతి అంతరించనుంది. శరవేగంగా పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలతో పళ్లు, ఆహార ధాన్యాల ఉత్పత్తి పిచ్చుకలు అంతరించిపోవడానికి కారణాలు. సెల్యూలర్ టవర్లు నుంచి వెలువడే అయస్కాంత తరంగాలు ఆ జాతికి ముప్పుగా మారాయి. కృత్రిమమైన పిచ్చుకగూళ్లను ఏర్పాటు చేయడం ద్వారా పిచ్చుక జాతిని కొంతవరకు సంరక్షించవచ్చని శాస్త్రవేత్తల సలహా యిస్తున్నారు.

సేద్యవ్యవసాయం, రసాయనాల వాడకం తగ్గింపు, పచ్చదనం విస్తీర్ణత పెరుగుదల కాలుష్యనివారణతో ప్రకృతిని కాపాడుకుందాం. పర్యావరణ సమతుల్యతను సాధించుకుందాం. అంతరించిపోతున్న జీవరాసులను రక్షించుకుందాం. జీవవైవిధ్యాన్ని కాపాడుకుందాం. ప్రకృతితో, పక్షులతో విహరిద్దాం.

– జుగాష్ విలి


బాలచెలిమి డెస్క్

సైన్స్

# పొమ్మని తోస్తే తిరిగి వచ్చే డబ్బా

ఈ గారడీకి గుండ్రని పెద్ద డబ్బా, పొడుగుపాటి బలమైన రబ్బరుముక్క, దారం, బరువైన ఇనుప వస్తువు కావాలి.

ఈ డబ్బా మట్టులోనూ, మూతలోనూ 8-10 సెం.మీ. ఎడంలో మేకుతో రెండేసి చిల్లులు పొడవాలి. బలమైన రబ్బరు ముక్కను ఈ నాలుగు చిల్లులలోనుంచే దూర్చి, బిగించి, ముడి వెయ్యాలి. డబ్బాలోపల, సరిగ్గా మధ్యలో రెండు రబ్బరు ముక్కలనూ దగ్గరగా లాగి, అక్కడ ఒక బరువు కట్టాలి. పాత తాళం గానీ, మరి ఏదైనా ఇనుప వస్తువుగానీ ఇందుకు పనికి వస్తుంది.




తరువాత ఈ డబ్బాని నేల మీద పెట్టి ఎదరకి తోస్తే దొర్లుకుంటూ కొంత దూరం వెళ్లి ఆగి, మళ్లీ వెనక్కి దొర్లుకుంటూ బయలుదేరిన చోటుకే వచ్చి ఆగుతుంది! ఇది ఇలా ఎందుకు జరుగుతుందో తెలిసిందా?

డబ్బా ముందుకి దొర్లుకుంటూ వెళ్లినప్పుడు లోపల కట్టిన బరువు ఉన్నచోటనే ఉండి, రబ్బరు తాళ్లని మెలి తిప్పుతుంది. మళ్లీ మెలిక విప్పుకునే ప్రయత్నంలో వెనక్కి దొర్లుకుంటూ వస్తుంది. లోపల ఉన్న రబ్బరు తాళ్లకు బరువు కట్టావని తెలియని మీ స్నేహితులు ఈ గమ్మత్తు చూసి ఆశ్చర్యపడతారు.

**- డాక్టర్ మహీధర నళినీ మోహన్**

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

శతకం


## వేమన పద్యాలు

**అనగ ననగ రాగ మతిశయిల్లుచునుండు**
**తినగ తినగ వేము తియ్యనుండు**
**సాధనమున పనులు సమకూరు ధరలోన**
**విశ్వదాభిరామ వినురవేమ**

తాత్పర్యం : పాడగా పాడగా రాగం వృద్ధి అవుతుంది. తినగా తినగా వేపాకు కూడా తియ్యగా ఉంటుంది. అలాగే ధృఢ సంకల్పంతో పట్టుదలగా చేపట్టిన పనిని చెయ్యగా అది తప్పకుండా సమకూరుతుంది.

**భూమిలోన బుట్టు భూసార మెల్లను**
**తనువులోన బుట్టు తత్వమెల్ల**
**శ్రమములోన బుట్టు సర్వంబు తానౌను**
**విశ్వదాభిరామ వినురవేమ**

తాత్పర్యం : భూమిలోన భూసారం పుట్టినట్లే, తనువులో తత్వం పుడుతుంది. అలాగే శ్రమము యొక్క ఫలితమంతా బ్రహ్మమనే తెలియాలి.



## కవిత



# అబ్దుల్ కలాం భావనలు

విజయానికి చిహ్నము
విరమించని ప్రయత్నము
ప్రతికూల తలపులే!
ప్రగతికి అవరోధము

విజయానికి బాటలు
బ్రతుకున అపజయాలు
భవితకవి పాఠాలు
దిద్దును జీవితాలు

మహోన్నత లక్ష్యాలు
సాధనకు మార్గాలు
వ్యూహ నైపుణ్యమే
విజయానికి త్రోవలు

వెలుగు వైపు పయనము
తొలగజేయు అశుభము
కలుగజేయు ఫలితము
మలుపు తిరుగు జీవితము


**- గద్వాల సోమన్న**
ఎమ్మిగనూరు, కర్నూలు
m : 9966414580



విద్యార్థి తెలుగు
"పలుక" లేకపోవడానికి కారణం
**"పలక"**
లేకపోవడమే


## బాలచెలిమి క్లబ్



## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : -------------------
తండ్రి పేరు : -------------------
పుట్టినతేదీ : -------------------
చిరునామా : -------------------
-------------------
-------------------
పిన్ : -------------------
హాబీలు : -------------------
మొబైల్ : -------------------
ఇ-మెయిల్ : -------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com









పండుగ

# కార్తీక పున్నమి పూట

## గురునానక్ జయంతి

**తేజ :** తాతగారు ఈ నెలలో మాకు రెండు పండగలకు ఒకటే సెలవట! రెండు ఇవ్వవచ్చు కదా?!

**తాత :** నీకు ఎన్నిసార్లు చెప్పాను పండగలు అంటే సెలవు రోజులు కాదని.

**తేజ :** సరేలే ఇంకెప్పుడు అలా అనను గాని ఇంతకీ ఈ రెండు పండగల సంగతేంటో చెప్పు మరి.

**తాత :** ఈ శరత్ ఋతువులోనిదే కార్తీక మాసం. ఈ నెల అంతా శివుడిని పూజిస్తూ తెల్లవారు ఝామునే నిద్రలేచి శివాలయాలకు వెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి ఉపవాసాలు ఉంటూ శివారాధన చేస్తారు.

**తేజ :** ఈ కార్తీక మాసంలోనే ఎందుకు మరో నెలలో ఎందుకు చేయరు?

**తాత :** శివునికి ఇష్టమైన మాసం కార్తీక మాసం అంటారు. ఈ నెలలో "చలి – వేడి" సమపాళ్లలో ఉండి వాతావరణం కూడా ప్రశాంతంగా ఉంటుంది.

**తేజ :** ఔను తాతయ్య. ఈ పూజల్లో ప్రత్యేకత ఏమిటి?

**తాత :** అభిషేకాలతో పాటు దీపాలు పెట్టడం ప్రత్యేకంగా చేస్తారు.

**తేజ :** బోలెడు కాంతిని ఇచ్చే కరెంటు లైట్లు ఉండగా ఆ నూనె దీపాలు ఎందుకు తాత?! ఎంతో జాగ్రత్తగా నూనె పోస్తూ వెలిగించాలి. గాలికి అవి ఆరి పోతుంటాయి. ఒకసారి నానమ్మతో గుడికి వెళ్లినప్పుడు చూసా ఆమె తిప్పలు.

**తాత :** నూనె పోసి వెలిగించే అ దీపాలనే మనం పవిత్రంగా పూజిస్తాం. మనిషి జీవితానికి దీపానికి విడదీయరాని అనుబంధం ఉంది.

**తేజ :** ఔనండి కరెంటు లేని ఆ రోజుల్లో నూనె దీపాలు వెలిగించి ఉండవచ్చు. హాయిగా కరెంటు వుండి కూడా ఇంకా నూనె దీపాలు దేనికి? చాదస్తం కాకపోతేను?

**తాత :** "అక్కడే తప్పులో కాలేస్తున్నావ్!" నూనె దీపాలు వెలిగించడం వల్ల మనకు ఏకాగ్రత పెరగడంతో పాటు కంటి జబ్బులు రావు అంతేకాదు వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుంది. అందుకే ఈ నెల రోజులు దీపాలను పూజించి నదులు, చెరువుల్లో దీపాలు విడిచే సంస్కృతి మన పెద్దవారు అమలు చేసారు. అసలు రోజూ దీపం వెలిగించి పూజించాలి. అలా వీలు కాదు కనుక కనీసం నెల రోజులు అదీ వీలు కాకపోతే 'కార్తీక పౌర్ణమి' రోజు మన శక్తి కొలది దీపాలు వెలిగించి పూజలు చేయడం ఉపవాసం ఉండడం వల్ల మనకు ఆరోగ్యంతో పాటు వాతావరణ ప్రశాంతత కలుగుతాయి.

**తేజ :** అసలు 'కార్తీక పున్నమి' రోజు ఏమి చేస్తారు తాతయ్యా?

**తాత :** పురాణాల ప్రకారం ఈ రోజునే "త్రిపురా సురుడు" అనే రాక్షసుడిని శివుడు హత మార్చాడు. త్రిపురాసురుడి బాధల నుంచి విముక్తి కలిగిన ఆనందంతో దీపాలు వెలిగించి ప్రజలంతా శివుడిని పూజించారు. అదే నేటికీ ఆచారంగా సాగుతోంది.

**తేజ :** దీపావళి నేపథ్యం కూడా అంతే కదా?!

**తాత :** ఔను బాగా గుర్తు పెట్టుకున్నావ్. ఈ కార్తీక పున్నమి రోజు అన్ని శివాలయాలతో పాటు శివుని

నిలయమైన కాశీలో దేరదీపావళి పేరుతో విశేష పూజలు చేసి లక్షలాదిగా దీపాలు వెలిగిస్తారు. ఆ దృశ్యం చూడటానికి రెండు కళ్లూ సరిపోవు.

తేజ : మరి ఈ రోజే 'గురునానక్ జయంతి' అంట కదా మా స్కూల్‌లో అన్నారు. అసలు ఆయన ఎవరు? ఆయన పుట్టిన రోజు పండుగ ఏమిటి?

తాత : మనకున్న మతాలలో ఒకటి 'సిక్కుమతం'. ఈ మతానికి చెందిన వారు మన దేశంతో పాటు ప్రపంచ దేశాలలో ఉన్నారు. ఆ మతాన్ని స్థాపించిన వాడే "గురునానక్". ఆయనే సిక్కుల తొలి గురువు. పంజాబ్‌లోని 'తేల్వండి' అనే గ్రామంలో 1469 సం॥లో కార్తీక పౌర్ణమి రోజు "నానక్" పుట్టాడు.

తేజ : ఇంతకీ ఆయన చేసిన గొప్ప పనేంటి?

తాత : 16 ఏళ్లకే పలు భాషల్లోని అనేక మత గ్రంథాలను హేతుబద్ధ దృష్టితో చదివి అర్థం చేసుకున్నాడు. అంత చిన్న ముసుగులోనే అంతటి ప్రతిభ గల ఆ పిల్లాడిని ఆ రోజుల్లో అందరూ దైవత్వం నిండిన వ్యక్తిగా గౌరవించేవారు.

తేజ : 'వావ్! నానక్ టూ... ఇంటిలిజెంట్' అన్న మాట.

తాత : ఆ రోజుల్లో హిందూ - ముస్లిం మతస్తుల మధ్య మతపరమైన గొడవలు జరుగుతుండేవి వాటిని అంతం చేయడానికి తన ప్రబోధనలు సిద్ధాంతాల వ్యాప్తి కోసం ఎంతో కృషి చేసి 'మానవులందరినీ సమానంగా ఉంచేదే నిజమైన మతం. అదే అసలైన భక్తి అనే భావన కలిగించాడు. అందుకోసం నాలుగు సార్లు ప్రపంచ యాత్రలు చేసాడు.

తేజ : అసలు 'సిక్కు' అంటే అర్థం ఏమిటి?

తాత : "శిష్య" అనే సంస్కృతీ పదానికి లౌకిక భాషా రూపంగా "సిక్కు" అనే మాట వాడుకలోకి వచ్చింది. గురుశిష్య సంబంధం అన్ని మతాల వారికి ఉంది. నానక్ హిందూ మతంలోని కులవ్యవస్థను. ముస్లిం మతంలోని మూఢత్వాన్ని ఖండించి సరళమైన భాణిలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో సర్వమత సమానత్వాన్ని బోధించి సఫలీకృతమై తన తరవాత కాలంలో కూడా తన భావాలను ప్రచారం చేసి ఆచరించేలా శిష్యగణాన్ని తయారు చేశాడు.

తేజ : మరి ఈ సిక్కులకు మత గ్రంథం ఉంటుందా?

తాత : ఎందుకు లేదు. సర్వమత సమానత్వం బోధించే సూక్తులు, కీర్తనలతో నానక్ తర్వాత ఐదవ గురువు "అర్జున్" "గురుగ్రంథ సాహితి" పేరుతో సంకలనం చేయించాడు. దానినే నేటికే సిక్కు మతస్తులంతా "గురుగ్రంథ్" పేరుతో పవిత్రంగా పూజించి, పఠించి ఆచరిస్తారు. లేదు ఆదిగురువు నానక్‌కు ప్రతిరూపంగా ఆరాధిస్తారు.

తేజ : మరి వీరికి గుళ్లు గోపురాలు ఉంటాయా?

తాత : ఎందుకు లేవు వీరు ప్రార్థనలు చేసుకునే ప్రాంతాలను "గురుద్వార్"లు అని పిలుస్తారు. గురునానక్ జన్మించిన పంజాబ్‌లో 16వ శతాబ్దంలో నాల్గవ సిక్కు గురువు రాందాస్ నిర్మించిన స్వర్ణదేవాలయం వీరి ప్రధాన "గురుద్వార్". అక్కడ గురు గ్రంథంతో పాటు గురునానక్ అవశేషాలను పవిత్రంగా పూజిస్తారు.

తేజ : మరి కార్తీక పున్నమి నాటి గురునానక్ జయంతి ఏమిటి?


తాత : వారి ఆదిగురువైన "గురునానక్ పుట్టిన రోజు" నాడు ఆయన విశ్వాసకులకు ఆనందకరమైన పండగ రోజే కదా!! ముందు రోజే తమ ప్రార్థనా మందిరాలైన గురుద్వారాలను అందంగా అలంకరించి కార్తీక పున్నమి రోజు పొద్దునే కొత్త బట్టలు ధరించి గురుద్వారంకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. సాయంత్రం పూట వారు పవిత్రంగా పూజించే గురుగ్రంథాన్ని పల్లకిలో ఉంచి ఊరేగిస్తూ ఆటపాటలతో ఆనందిస్తారు. ఈ ఊరేగింపులో స్త్రీలు, పిల్లలు పాల్గొని అన్ని మతాల వారికి మిఠాయిలు పంచుతారు.

తేజ : బాగుంది తాతయ్య. ఒకే రోజు వచ్చిన రెండు పండగల విశేషాలు.

– డా. అమ్మిన శ్రీనివాసరాజు
m : 7729883222

కథ

# పాప సాయం



అనగనగా ఒక ఊరిలో ఒక ముసలమ్మ ఉండేది. ఆ ముసలమ్మ తన కొడుకు దగ్గరకు వెళ్లాల నుకుంది. అన్ని సర్దుకుని ఆమె వెళ్తుండగా రోడ్డు దాటవలసి వచ్చింది. కానీ ఆమె రోడ్డు దాటలేక పోతున్నది. అనేక వాహనాలు వస్తున్నాయి. ముసలమ్మకు చాలా భయం వేసింది. అంతలో అటువైపుగా వస్తున్న ఒక పాప ఆమెను చూసింది. తను ముసలమ్మను రోడ్డు దాటించాలను కుంది. వెంటనే ఆమె దగ్గరకు వెళ్లి 'బామ్మా! నేను నిన్ను రోడ్డు దాటిస్తాను' అని చెప్పి ఆమెను రోడ్డు దాటించింది. సహాయం చేసినందుకు ముసలమ్మ కృతజ్ఞతలు చెప్పి పాపను దీవించింది. రోడ్డు దాటిన ముసలమ్మ తన కొడుకు దగ్గరకు చేర్చే బస్సు ఎక్కింది. అది చూసిన పాపకు వాళ్ళ అమ్మమ్మ గుర్తుకు వచ్చింది.


**– జి. మేఘన**

ఆరవ తరగతి

జడ్పీహెచ్ఎస్ తాటికల్, నల్గొండ జిల్లా

m : 7989117415



చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సం။లకు | : రూ. 750 |

'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

ఆరోగ్యం

# మంచి ఆహారపు అలవాట్లు








శుభ్రమైన మంచి ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలం. వ్యాధి నిరోధక శక్తి లభించి వ్యాధుల నుండి మనల్ని మనం కాపాడుకోగలం.

**ఆహారంలో తగినంత ప్రోటీన్లను చేర్చాలి**

ప్రోటీన్లు శరీరానికి చాలా ముఖ్యమైనవి వాటిని ఖచ్చితంగా ఆహారంలో చేర్చాలి. బ్రోకలీ, సోయాబీన్స్, కాయ ధాన్యాలు, అస్పరాగస్ బచ్చలికూర మొ॥.

**ఆహారాన్ని మంచిగా నమలాలి**

ఆహారాన్ని జీర్ణం చేయడానికి సులభమైన మార్గం నమలడం. చాలామంది తరుచుగా తమ ఆహారాన్ని నమలకుండా మింగేస్తారు. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణం కాదు. ఎక్కువ సేపు నమిలి తినడం వలన ఆహారం సులభంగా జీర్ణమవుతుంది.

**అల్పాహారాన్ని ఎప్పుడు మరిచిపోవద్దు. దాట వేయవద్దు**

అల్పాహారం బహుశా రోజులో అత్యంత ముఖ్యమైన భోజనం ఎందుకంటే శరీరం రాబోయే రోజుకు సిద్ధం చేసుకుంటుంది. భోజన సమయాలను పాటించడం వలన పొట్ట జీర్ణక్రియా ఎంజైమ్లను ఆయా సమయాలలోనే విడుదల చేస్తుంది. విఫలమయితే గందరగోళానికి గురై అల్సర్లు ఏర్పడుతాయి.

**ఏమి తింటున్నామో చూడాలి**

తక్కువ కాలరీలు, సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఎంచుకోవాలి. తీపి మోతాదును బాగా తగ్గించాలి. చక్కెర వాడాల్సిన చోట వీలైతే బెల్లం, తేనెను ఉపయోగించాలి. తీపి పదార్థాలకు బదులు పండ్లు తినాలి.

**ఆకు పచ్చని ఆకు కూరలు ఎంచుకోవాలి**

ఆహారంలో ఆకుకూరలు ఉండేటట్లు చూడాలి. అవి ప్రోటీన్లు ఇనుము, ఫైబర్లు అధికంగా ఉంటాయి.

**ఆహారం పై దృష్టి పెట్టండి**

టి.వి.ని చూస్తూ తింటున్నప్పుడు ఎంత తింటున్నామో తెలియదు. కడుపు నిండినప్పటికి మెదడు ఆ విషయాన్ని గుర్తించక, ఇంకా తినమని చెబుతుంది. చివరకు ఎక్కువ తినడంతో ముగుస్తుంది. తినే ఆహారంపై దృష్టిపెట్టినప్పుడు మనమెంత తింటున్నామో తెలుస్తుంది.

**నీటిని ఎప్పుడు తాగాలి**

శరీరం నీటి ద్వారా గణనీయమైన మొత్తంలో ఖనిజాలను పొందుతుంది. పుష్కలంగా నీరు త్రాగడం వల్ల శరీరం నిర్విషీకరణ చెందుతుంది. మెరిసే చర్మాన్ని అందిస్తుంది. భోజన సమయంలో నీరు త్రాగకుండా ఉండండి. భోజనానికి 30 నిమిషాల ముందు లేదా తరువాత నీరు త్రాగుట మంచిది. ఉదయం నీరు త్రాగడం మంచిది. ప్రేగులను శుభ్రపరుస్తుంది.

**జీర్ణశక్తిని పెంచుకోవాలి**

"ఏమి తినాలో తెలుసుకోవడం ఎంత ముఖ్యమో. ఎంత తినాలో కూడా తెలుసుకోవడం అంతే ముఖ్యం." ఆహారం తీసుకున్న తరువాత వజ్రాసనంలో కూర్చోవాలి. దీని వలన పొట్టకు రక్తప్రసరణ పెరిగి ఆహారం మంచిగా జీర్ణమవుతుంది. మంచి ఆహారపు అలవాట్లు మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో సహాయపడతాయి.

– బాల సారస్వతం (ఆరోగ్యం – విజ్ఞానం)



# కలంచెలిమి



**టి. దీపిక**

8వ తరగతి
జి.ప.ఉ.పా. కుకునూర్ పల్లి,
సిద్ధిపేట జిల్లా.



**వి పల్లవి**

10వ తరగతి, ఇంగ్లిష్/మీ
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
పాన్గల్, వనపర్తి జిల్లా

**వేముల రేవతి**

9వ తరగతి ఇంగ్లీష్ మీడియం,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
NSC కాలనీ ఖమ్మం.



**కె. ప్రణీత్**

9వ తరగతి 'బి',
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పూడూర్, వికారాబాద్.





**తిరుమల తేజ**

10వ తరగతి,
అరవింద హై స్కూల్,
తాడేపల్లి.



**ఎం. అక్షయ్‌కుమార్**

9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత
పాఠశాల, మసుమల్ల, వరంగల్

కథ

# కాలం మారింది



సాయి, తేజ బడి నుంచి రాగానే నాన్నమ్మ దగ్గరకు పరుగు తీశారు. "నాన్నమ్మ... నాన్నమ్మా! ఓ మంచి కథ చెప్పవా!" అంటూ బుద్ధిగా కూర్చున్నారు.

"అలాగే చెపుతానురా! శ్రద్ధగా వినాలి మరి" అంటూ చెప్పుకొచ్చింది నాన్నమ్మ ఓ కాకమ్మ కథను.

ప్రకృతి ఒడిలో అల్లారు ముద్దుగా ఆడుకుంటున్న పసిబిడ్డ లాంచి చల్లని పల్లె ఆ ఊరు. పచ్చదనానికి పెట్టింది పేరు. ఊరి పొలిమేరలో ఉంది పురాతన కాలం నాటి శివాలయం. ఆ ఆలయ ప్రాంగణంలో ఉన్న మామిడి చెట్టు మీద తన పిల్లలతో కాపురం ఉంటుంది ఓ కాకమ్మ. ఆకసమంతా విహరించి తన పిల్లల కోసం తెచ్చిన ఆహారం తినిపించి... తర్వాత తనూ ఒక మాంసం ముక్కను నోట్లో పెట్టుకుంది. ఇంతలో ఆ చెట్టు కిందికి ఓ నక్క వచ్చింది. ఆత్మీయంగా మిత్రున్ని ఆహ్వానించింది తన రెక్కల రెపరెపతో కాకి. "మిత్రమా!" అంటూ ప్రేమగా కుశల ప్రశ్నలు అడిగింది నక్క. కాకి నోటిలో మాంసపు ముక్కపై ఆశపడింది. "నీ మధుర గానంతో నాకు వీనుల విందు చేయ"మని కాకిని కోరింది.

"నీ ఇంటి పంట కాబట్టే కోకిలమ్మకు అంతటి గాన మాధుర్యం అబ్బింది సుమా. నీకేం తక్కువ" అంటూ ప్రశంసల జల్లు కురిపించింది. నక్క చెడు బుద్ధిని గ్రహించి నోటిలోని ముక్కను కాళ్ళ మధ్య పెట్టుకొని రాగాన్ని అందుకుంది కాకి. "నీ గాన మాధుర్యానికి నేను మై మరిచి పోయాను. ఓసారి నాట్యం కూడా చేయవా ! చూసి తరిస్తాను" అంది నక్క. "ఓ అదెంత భాగ్యం! ఆడుతూ పాడుతాను. పాడుతూ ఆడగలను అంటూ తన కాళ్లలోని మాంసం ముక్కను చెట్టు కొమ్మల్లో పెట్టి ఆ రసాలసాల వేదికపై తన గాన కచేరి చేసింది. "నీ గానం, అభినయం అద్భుతం మిత్రమా! మరి! నేను వస్తాను!" అంటూ మరో ప్రణాళికను రచించడానికి దారి వెతుక్కుంటూ ముందుకు సాగింది నక్క.


"మిత్రమా! మిత్రమా... కారణం ఏదైనా- నీవు నా ఇంటి ముందుకొచ్చిన ఆత్మీయ అతిథివి. అతిథిని గౌరవించడం మన సాంప్రదాయం. ఆగు ఆగు..." అంటూ పిలిచింది. తన పిల్లల కోసం తెచ్చిన ఆహారంలో ఓ నాలుగు ముక్కలు కిందకు వేసింది. "మిత్రమా! మోసం, ద్వేషం అపజయానికి సోపానాలు. ఇచ్చి పుచ్చుకునే లక్షణమే స్నేహాన్ని కలకాలం నిలుపుతుంది సుమా! ప్రేమకు, విశ్వాసానికి, నిజాయితీకి, మానవులకు మనమే ఆదర్శం. ఒకరి కష్టానికి ఒకరం ఆసరాగా నిలబడుదాం. మిత్రమా! నీకు నేనున్నాన"ని ఏనాడు మరువకు... అంటూ రివ్వున ఆకసాన ఎగురుకుంటూ వెళ్లింది కాకి. కృతజ్ఞతా పూర్వకంగా కాకి ఎగిరిన వైపే చూస్తున్నది నక్క.

"నాన్నమ్మ! ఈ కథను తాతయ్య మరోలా చెప్పారు తెలుసా!" అన్నారు పిల్లలు. "అవును! నాన్నలూ కాలం మారింది. ఈ కథను మీరు మరోలా చెప్పే ప్రయత్నం చేయండి. చూద్దాం" అంది నాన్నమ్మ. "ఓ అలాగే? నాన్నమ్మ. ఈ కథ మాత్రం చాలా బాగుంది!" అంటూ పిల్లలు ఆడుకోవడానికి వెళ్ళారు.

- డాక్టర్ దాసోజు పద్మావతి
m : 9441286794

# నోబెల్ బహుమతి విజేతలు-2024

ఆల్ర్ఫెడ్ నోబెల్ స్వీడిష్ ఆవిష్కర్త మరియు పారిశ్రామికవేత్త. ప్రతి సంవత్సరం నోబెల్ బహుమతులు ప్రపంచంలోని మేధోపరమైన సాధనకు ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మక అవార్డులుగా విస్తృతంగా పరిగణించబడుతున్నాయి. ఈ నోబెల్ బహుమతులు భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఫిజియాలజీ లేదా వైద్యశాస్త్రం, సాహిత్యం, శాంతి రంగాలలో నోబెల్ వర్ధంతి ఐదవ వార్షికోత్సవం డిసెంబర్ 10, 1901న మొదటిసారిగా బహుమతులు ఇవ్వడం జరిగింది. దిరాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫిజిక్స్, కెమిస్ట్రీ మరియు ఎకనామిక్స్ కోసం బహుమతులు అందజేస్తుంది. కరోలిన్స్కా ఇన్స్టిట్యూట్ ఫిజియాలజీ లేదా మెడిసిన్ కోసం బహుమతిని అందజేస్తుంది మరియు దిస్వీడిష్ అకాడమీ సాహిత్యానికి బహుమతిని అందజేస్తుంది. దిఓస్లోలోని నార్వేజియన్ నోబెల్ కమిటీ శాంతి బహుమతిని అందజేస్తుంది.

| వర్గం | నోబెల్ బహుమతి విజేతలు (దేశం) | ప్రదానం |
|---|---|---|
| ఫిజియాలజీ లేదా మెడిసిన్ |  గ్యారీ రువ్కున్ (USA)<br>విక్టర్ అంబ్రోస్ (USA) | "మెడిసిన్ మైక్రోఆర్ఎన్ఏలను కనుగొన్నందుకు, జన్యు నియంత్రణకు అవసరమైన చిన్న అణువుల తరగతి" |
| భౌతిక శాస్త్రం |  జాన్ హాప్ఫీల్డ్ (USA)<br>జాఫ్రీ హింటన్ (UK) | "కృత్రిమ నాడీ నెట్వర్క్లతో మెషిన్ లెర్నింగ్ను ప్రారంభించే పునాది ఆవిష్కరణల కోసం" |
| రసాయన శాస్త్రం |  జాన్ ఎమ్.జంపర్ (UK)<br>డేవిడ్ బేకర్ (USA)<br>డెనిస్ హస్సాబిస్ (UK) | డెమిస్ హస్సాబిస్ మరియు జాన్ ఎమ్. జంపర్ "ప్రోటీన్ స్ట్రక్చర్ ప్రిడిక్షన్ కోసం" డేవిడ్ బేకర్ "కంప్యూటేషనల్ ప్రోటీన్ డిజైన్ కోసం" |
| సాహిత్యం |  హాన్ కాంగ్<br>(దక్షిణ కొరియా) | "చారిత్రక బాధలను ఎదుర్కొనే మానవ జీవితంలోని దుర్బలత్వాన్ని బహిర్గతం చేసే ఆమె తీవ్రమైన కవిత్వ వ్యక్తీకరణకు" |
| నోబెల్ శాంతి |  నిహాన్ హిడాంకియో | "అణ్వాయుధాలు లేని ప్రపంచాన్ని సాధించడానికి తన ప్రయత్నాలకు, అణ్వాయుధాలను మళ్లీ ఉపయోగించకూడదని సాక్షి వాంగ్మూలం ద్వారా ప్రదర్శించినందుకు" |
| ఆర్థిక శాస్త్రం |  సైమన్ జాన్సన్,<br>జేమ్స్ A. రాబిన్సన్<br>డారన్ అసిమోగ్లు, | "సంస్థలు ఎలా ఏర్పడతాయి, శ్రేయస్సుపై ఎలా ప్రభావం చూపుతాయి అనే అధ్యయనాల కోసం" |

– సచిన్ కోత్వాల్



# నా పల్లెటూర్లు

నీటి కాలువల సొగసులు
వరి పైరుల వయ్యారాలు
పచ్చదనపు పంట పొలాలు
అందమైన పల్లెటూర్లు

నిండుదనపు ఆనవాళ్లు
పసుపునంటిన గడపలు
చిన్న చిన్న పశువుల పాకలు
అన్నదాతల ఆలయాలు

ఎన్నెన్నో పండుగ ఉత్సవాలు
గ్రామ దేవతల జాతరలు
పంటకోతల ఆనందాలు
మది నిండా సంక్రాంతి సంబరాలు

కోడి కూత మేలుకొలుపులు
తెల్లవారగ భక్తి పాటలు
అందర్నీ వరుస పెట్టి పిలుపులు
పల్లెలే ప్రశాంత నిలయాలు

షేక్ అంజుమ్
9వ తరగతి
ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ), కర్నూలు
m : 8639635279

# చెట్టమ్మ



చిట్టి చిట్టి చేతులతో
మొక్క నాటుదాం
నీరు పోసి కంచె వేసి
కాపాడుదాం
అమ్మ నాన్న పేరు పెట్టి ఆడుకుందాం
ప్రతిరోజు చూసుకుంటూ
స్నేహం చేద్దాం
తొలి ఆకు తొడిగితే
తేలిపోదాం
మారాకు తొడిగితే
మురిసిపోదాం
ఇంతింతై వృక్షమై
ఎదగనిద్దాం
ఆ ఆకు ఈ కొమ్మ
ఆ మొగ్గ ఈ పువ్వు
ఆ కాయ ఈ పండు
అన్నీ ఇచ్చే చెట్టమ్మకు దండంపెడదాం
ఆ చెట్టు నీడలో
ఆడుకుందాం
కలిసి పాడుకుందాం

డా. శారదాహన్మాండ్లు
m : 9912275801





విద్యార్థులే స్ఫూర్తిదాతలు

# ఎలుకుర్తి నుంచి మహీంద్రా యూనివర్సిటీ వరకు అనితర ప్రయాణం



ఇటువంటి విద్యార్థి తరగతికి ఒకరుంటే, ఉపాధ్యాయులందరికీ నిద్ర పట్టకపోవడం ఖాయం! 2005లో నర్సంపేట దగ్గరలోని శ్రీ గురుకులంలో పని చేస్తున్న రోజులు. 8 మంది విద్యార్థులున్న 8వ తరగతికి బోధించాలంటే ఉపాధ్యాయులందరికీ హడలు! ఎందుకంటే అందులో ముఖేష్ ఉంటాడు కాబట్టి! వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని ఎలుకుర్తి అతని స్వగ్రామం. ఎంతో చురుకైన విద్యార్థి, ఏడవ తరగతి బోర్డు పరీక్షల్లో జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. చక్కని చేతిరాత అతని సొంతం. రాజు, హరిణి, ఆ తరగతిలో అందరూ చాలా తెలివైన పిల్లలే. ప్రశ్నల మీద ప్రశ్నలు గుప్పించే వారు. నేను వారికి ఇంగ్లీష్ చెప్పాను. కెరీర్ మొదట్లో ఇటువంటి విద్యార్థులు ఉండడం చాలా ఉపయోగపడింది. టీచర్స్ అంతా హాస్టల్లోనే వుండే వాళ్ళం. పాఠశాల కరస్పాండెంట్ సమ్మిరెడ్డి గారు రాత్రి 1:00కు వచ్చినా నా గదిలో లైట్ వేసే ఉండేది. 'రవీ వెళ్ళి పడుకో, రేపు ప్రిపేర్ అవుదువులే' అనేవారు సర్. నాదేమో తెలుగు మీడియం నేపథ్యం, పిల్లలేమో ఆంగ్ల మీడియం. పాఠాలు, వ్యాకరణాంశాలు అన్ని శ్రద్ధగా ప్రిపేర్ కావలసివచ్చేది.

ముఖేష్ లాంటి విద్యార్థులకు ఎటువంటి సందేహం వచ్చినా నివృత్తి చేయాలనే ఒకే ఆలోచనతో ఎంతగానైనా కష్టపడే వాళ్ళం. ఉపాధ్యాయుడిగా చాలా మంచి పేరు వచ్చింది. ఆ తర్వాత నేను పై చదువుల కొరకు వెళ్లాను. ఎన్నో లక్ష్యాలతో ఉన్న ముఖేష్ జీవితం ఇంటర్మీడియట్‌లో ఉండగా ఒక్కసారిగా మారిపోయింది. వాళ్ళ నాన్న తాటి చెట్టు పైనుండి పడి తీవ్రంగా గాయపడ్డాడు. కలల రెక్కలు ఒక్కసారిగా తెగిపడ్డాయి. ఆర్థికంగా కుటుంబం చితికి పోయింది. అయినా పట్టు వదలకుండా చదివి ముఖేష్ హైదరాబాదులోని ఒక మంచి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు సంపాదించాడు. వివిధ పార్ట్ టైం జాబ్స్, కొన్నిసార్లు క్యాటరింగ్ వర్క్ కూడా చేస్తూ, టీచర్స్ సహకారంతో ఎంతో కష్టపడి ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఇంకా ఎంతో చదవాలని ఉన్నా ఆర్థిక పరిస్థితి మెరుగు పర్చడం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో క్యాంపస్ ప్లేస్మెంట్‌లో వచ్చిన ఉద్యోగంలో చేరాడు. రెండున్నర సంవత్సరాలు ఒక పెద్ద కార్పొరేట్ కంపెనీలో జాబ్ చేసిన తర్వాత ముఖేష్ మళ్ళీ తన చదువును కొనసాగించాడు. మన దేశంలోనే అత్యుత్తమమైన టాప్ 10 మేనేజ్ మెంట్ కాలేజీల్లో ఒకటైన కేరళలోని కోజికోడ్ ఐఐఎంలో మేనేజ్మెంట్‌లో పీహెచ్డీ పూర్తి చేశాడు. ఇప్పుడు ప్రఖ్యాత మహీంద్రా యూనివర్సిటీలో మేనేజ్మెంట్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు ముఖేష్. చదువు... సమస్యలు, మళ్లీ చదువు... ఇలా కొనసాగింది తన ప్రయాణం. ఆత్మవిశ్వాసం, సాధించగలనన్న నమ్మకం మొదటి నుండి ముఖేష్‌లో ఉన్న గొప్ప లక్షణాలు. ఇప్పుడు మేము నిర్వహిస్తున్న లీడ్ లైబ్రరీ కోసం కూడా ఎన్నో విలువైన పుస్తకాలను సమకూర్చాడు. అందులో మేము ఎన్నో సార్లు తరగతి గదిలో చర్చించిన లాల్ బహదూర్ శాస్త్రి, అబ్రహం లింకన్ వంటి మహనీయుల జీవిత చరిత్రలు, సైన్స్ పుస్తకాలు ఉన్నాయి. "సర్, మీరు ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు. నేను కూడా ఎంతో కష్టపడాల్సి వచ్చింది. మనలాగా చదువు మీద ఆసక్తి ఉన్న పిల్లల కోసం ఈ పుస్తకాలను ఉపయోగించండి సర్" అని చెప్పాడు ముఖేష్. తను వచ్చిన దారిని మరిచిపోని ముఖేష్, విద్యార్థులకు కెరియర్ పరంగా కూడా ఎప్పుడంటే అప్పుడు గైడెన్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. తరగతి గదిలో నిత్యం ఉత్సాహంగా ఉండడం, చదవాల్సిన అంశాలను ముందే నేర్చుకొని రావడం, తరగతి గదిలో చక్కటి అంశాలను చర్చకు తీసుకు రావడం, ప్రశ్నించడం తదితర అంశాలలో ముఖేష్ ఎందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాడు. నర్మెట్ట ముఖేష్ భవిష్యత్తులో మరెన్నో శిఖరాలను అధిరోహించి మన దేశానికి గర్వకారణంగా నిలుస్తాడని ఆశిస్తూ ముఖేష్‌కు అభినందనలు.

– కాసుల రవికుమార్
m : 99083 11580

# బాలచెలిమి గ్రంథాలయంపై సమీక్ష

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ బాలచెలిమి గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ కాన్ఫరెన్సు హాలులో 29 సెప్టెంబర్ 2024 ఆదివారం బాలచెలిమి గ్రంథాలయాల నిర్వహణపై కార్యశాల జరిగింది.

సమావేశానికి చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ అధ్యక్షులు, బాలచెలిమి, దక్కన్ మాస పత్రిక సంపాదకులు మణికొండ వేదకుమార్ గారు అధ్యక్షత వహించారు. తెలంగాణా రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ డా. రియాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ డా. వి. వెంకటేశ్వర్లు, మహా అకాడమీ డైరెక్టర్ వై. మల్లికార్జున రావు, ప్రభుత్వ సిటీ కళాశాల అసిస్టెంటు ప్రొఫెసర్ డా. చేగోని రవికుమార్, రచయిత్రి డా. అమరవాది నీరజ వక్తలుగా పాల్గొన్నారు. బాలచెలిమి గ్రంథాలయాల రాష్ట్ర కన్వీనర్ గరిపల్లి అశోక్, బాలచెలిమి కో ఆర్డినేటర్ ఖైజర్ బాష నిర్వాహకులుగా వ్యవహరించారు.



మణికొండ వేదకుమార్ గారు మాట్లాడుతూ ప్రజలు చెల్లించే పన్నులో గ్రంథాలయం సెస్ కూడా ఉంటుంది. కానీ ఇటీవలి కాలంలో దానిని గ్రంథాలయ అభివృద్ధి కొరకు వాడడం లేదు. దీనిని బట్టి శాఖా గ్రంథాలయాల నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా వారి ఊరి గ్రంథాలయలయంతో తమకు ఉన్న చిన్నప్పటి అనుభూతులను పంచుకున్నారు.

ఈ రోజుల్లో సోషల్ మీడియా ఎంత దూసుకు పోతున్నా కూడా పుస్తకం శాశ్వతంగా నిలబడుతుంది. తెలుగు బాలసాహిత్యంలో వచ్చిన ఖాళీని పూరించడానికి బాలచెలిమి పత్రికను తెలుగులోనే 2500 కాపీలు ముద్రిస్తున్నామని చెప్పారు. తెలుగు రాష్ట్రాలలో వంద బాల చెలిమి గ్రంథాలయాలను స్థాపించాలనే ధ్యేయంతో ముందుగా 2019లో భూదాన్ పోచంపల్లి శాఖా గ్రంథాలయంలో బాలచెలిమి గ్రంథాలయాన్ని ప్రారంభించి మొదటి విడతగా పలుగ్రామాలలో ఆరు గ్రంథాలయాలను ఏర్పాటు చేశామని. కరోనా సమయంలో కూడా ఇవి పనిచేసాయని 2023 అక్టోబరు నెలలో కుకునూరుపల్లి, ఆర్ & ఆర్ కాలనీ గజ్వేల్, లింగరాజు పేటలలో బాలచెలిమి గ్రంథాలయాలను ప్రారంభించామని. 2024 అక్టోబరులో ఐదు గ్రంథాలయాల ప్రారంభానికి ప్రణాళిక సిద్ధమైందని, వాటితో 15 గ్రంథాలయాలు ఏర్పాటు పూర్తి అవుతుందని అన్నారు. దేశంలో ఒక మోడల్ గ్రంథాలయ నిర్వహణను సృష్టించడమే బాలచెలిమి గ్రంథాలయాల ధ్యేయమని చెప్పారు.

ముఖ్య అతిథిగా హాజరైన డా. రియాజ్ గారు తమ ప్రసంగంలో ప్రస్తుత సమావేశ ప్రాంగణాన్ని తెలంగాణా చైతన్యాన్ని కలిగించే ప్రదేశంగా చూస్తానని చెప్పారు. వేదకుమార్ గారు వ్యక్తి కాదు, వ్యవస్థ అన్నారు. అనేక కోణాలలో కనిపించే మనుషులు అతి కొద్ది మందిలో వేదకుమార్ ముఖ్యులు. తెలంగాణా మూలాలను చెప్పే పత్రిక డెక్కన్ లాండ్. హైదరాబాదు రాష్ట్ర చరిత్రను చెపుతూ తెలంగాణానే రూపాయి కాన్సెప్ట్ ను ప్రపంచానికి ఇచ్చిందని తెలియజేసారు. పాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పడడానికి నేపథ్యం గ్రంథాలయ ఉద్యమని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 1891 లోనే స్టేట్ సెంట్రల్ గ్రంథాలయ భవన నిర్మాణం పుస్తక ఆకారంలో జరిగిందని చెప్పారు. వేదకుమార్ గారు చేపట్టిన బాలచెలిమి గ్రంథాలయోద్యమం కూడా విలువలతో కూడిన భావితరాలను తయారు చేయడం ఖాయమన్నారు. చిన్నప్పుడు తాను పిల్లల పత్రికలు చదవడం



వల్లనే తాను స్పష్టమైన తెలుగు మాట్లాడగలుగుతున్నానని, పుస్తకపఠనమే తనను భిన్నంగా నిలబెట్టింది అనిచెప్పారు.

నవంబరు నెలలో 14 నుంచి 20 వ తేదీవరకు జరిగే గ్రంథాలయ వారోత్సవాల్లో ఒకరోజు బాలచెలిమి సెషన్స్ ఉండే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. డిసెంబర్ నెలలో జరిగే హైదరాబాదు పుస్తక ప్రదర్శనలో కూడా రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేసి, బాలసాహిత్య సెషన్స్ నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయాలను ఏర్పాటు చేయించడమే కాకుండా అవి సక్రమంగా పని చేసే దిశగా చర్యలు చేపడతా మన్నారు. లైబ్రరీ సైన్సులో పరిశోధన చేసిన డా. వెంకటేశ్వర్లు గారు మాట్లా డుతూ లైబ్రరీ హౌస్ ఆఫ్ నాలెడ్జ్ అని, నిర్వహణ బాగుంటేనే వాటి ఆశయం నెరవేరుతుంది అన్నారు. డా. రంగనాథ్ గారి కృషి వల్ల లైబ్రరీ నిర్వహణ ఒక శాస్త్రంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. గ్రంథాలయంలో పాఠకులకు సమయం వృథా కాకుండా వారికి అవసరమయ్యే పుస్తకం ఒక్కటైనా ఉండాలని, కొత్త పుస్తకాల జాబితాను విధిగా ప్రదర్శనకు పెట్టాలని. కనీసం నెలకు ఒకసారైనా వివిధ సృజనాత్మక ప్రక్రియల మీద కార్యశాల నిర్వహించాలని సూచించారు.

గ్రాఫాలజి మీద కోర్సు చేసిన వై. మల్లికార్జునరావు గారు మాట్లాడుతూ చేతిరాత బాగుండే వాళ్ళ మానసిక స్థితి నిలకడగా ఉంటుందనే విషయాన్ని చెపుతూ ఈ సందర్భంగా 2017లో స్టాన్ఫర్డ్ యూనివర్శిటీ చేసిన విజ్ఞప్తిని గుర్తుచేశారు.

హైదరాబాదు సిటీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా పనిచేస్తున్న డా. చేగొని రవికుమార్ గారు మాట్లాడుతూ పుస్తక వనరులు, పాఠకులు, వసతులు, ఆర్థిక వనరులు అనే నాలుగు అంశాలు ఉంటేనే గ్రంథాలయ నిర్వహణ సక్రమంగా సాగుతుందన్నారు. ఇదివరకు జిల్లా కేంద్ర గ్రంథాలయాలలో మహిళా, శిశు శాఖలు ఉండేవని గుర్తు చేస్తూ అవి ఇప్పుడు లేవని, అవి తప్పకుండా ఉండాలని అన్నారు. రచయిత్రి డా. అమరవాది నీరజ మాట్లాడుతూ పిల్లలు చదివే పుస్తక రచయితలు అందుబాటులో ఉంటే వారిని పిల్లలకు పరిచయం చేయాలని. పిల్లల సందేహాలను వారిలో వారే తీర్చుకునే విధంగా స్నేహపూరిత వాతావరణం ఉండాలని అన్నారు. సమత, మమత, మానవత సిద్ధాంతంతో సామాజిక కార్యకర్త రాజలింగం బాల చెలిమి గ్రంథాలయాల మీద కవిత చదివారు. గరిపల్లి అశోక్ గారి కృతజ్ఞతాభివందనలతో సమావేశం ముగిసింది.

– పైడిమర్రి గిరిజా
m: 9949443414

# బొమ్మలేద్దామా...



నందన్ కృష్ణ
6 సంవత్సరాలు, 3వ తరగతి, జెనీవా, స్విట్జర్లాండ్

## తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు

తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల దినోత్సవం సందర్భంగా శ్రీమతి కోదూరి శాంతమ్మ స్మారక సాంస్కృతికోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు 15 నవంబర్ 2024న జరుగుతాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు పాల్గొనవచ్చు. పోటీలు : కథ - రెండు పేజీలకు మించరాదు, వచన కవిత - 20 పంక్తులకు మించరాదు. పద్య కవిత - 5 పద్యాలు, చిత్రలేఖనం - 1 బొమ్మ. విద్యార్థులు రచనలను తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, అబిడ్స్, హైదరాబాద్ - 500001 చిరునామాకు పంపాలి. నవంబర్ 15న హైదరాబాద్‌లో అప్పటికప్పుడు నిర్వహించే పోటీలు : వ్యాసరచన, వక్తృత్వం, శాస్త్రీయ గాత్ర సంగీతం, లలిత సంగీతం, ఏకపాత్రాభినయం (మేకప్ లేకుండా). సాంస్కృతికోత్సవ పోటీల్లో పాల్గొనేవారు, ప్రతినిధులుగా పాల్గొనేవారు తమ పేరు, ఊరు, జిల్లా, తరగతి, సెల్ నెం, ఇతర వివరాలను వాట్సాప్ నెం. 9603727234 లో నమోదు చేసుకోవాలి.

**- డా. జె. చెన్నయ్య**
ప్రధాన కార్యదర్శి

## "ఏడు రంగుల వాన " పుస్తకావిష్కరణ




యువ బాలసాహితీవేత్త ముక్కామల జానకీరామ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోదాడలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరు రచించిన "ఏడు రంగుల వాన" పుస్తకం ఆవిష్కరణ సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్ లో జరిగిన యూత్ లిటరరీ ఫెస్ట్ లో శుక్రవారం 04. 10. 2024 న జరిగింది. ఈ పుస్తకాన్ని ప్రముఖ కవి, రచయిత, నవ తెలంగాణ ఫీచర్ ఎడిటర్ కె. ఆనందా చారి గారు ఆవిష్కరించారు. పిల్లలో నైతిక విలువలను పెంపొందించడానికి, సమాజానికి ఉత్తమ పౌరులను అందించడానికి ఈ కథలు ఎంతగానో ఉపయోగపడతాయి. జానకీరామ్ ఉపాధ్యాయుడిగా ఉంటూ పిల్లల్లో దేశభక్తి, పర్యావరణ స్పృహ, పెద్దల పట్ల గౌరవం, మొదలైనవి పెంపొందిస్తున్నారు అని చెప్పారు. వీరు కథలు రాయడమే కాకుండా పిల్లలతో కూడా కథలు రాయిస్తూ ఇటీవలే "ఊహలకు రెక్కలొస్తే" మేళ్ళ చెరువు బడి పిల్లలు అనే పుస్తకానికి సంపాదకత్వం వహించారు. పిల్లల కథలు వివిధ దినపత్రికలలో కూడా ప్రచురితం అయ్యాయి. వీరు సమాజానికి బాల రచయితలను అందించడం గొప్ప విషయం అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత ఎండ్లూరి మానస, బాల సాహితీవేత్త పుప్పాల కృష్ణమూర్తి, రచయితలు మోహన్ కృష్ణ, సలీమా, మన్ ప్రీతం, విప్లవ కుమార్, బద్ది గణేష్, లక్ష్మి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాలు ఆకలి తీర్చే ఔషధాలు -లోకకవి అందెశ్రీ

వనపర్తి జిల్లా పానగల్ బాలుర ఉన్నత పాఠశాలలో 25 సెప్టెంబర్ 2024న జరిగిన ఫ్లయింగ్ బర్డ్స్ విద్యార్థుల కవితా సంకలనాన్ని ముఖ్యఅతిథి అందెశ్రీ ఆవిష్కరించారు. అక్షరాలు ఆకలి తీర్చే ఔషధాలు కావాలని అందెశ్రీ అన్నారు. మనిషి ఎదుర్కొనే ఆకలి, ఆశ, కోరికలకు పరిష్కారం అక్షరమే అన్నారు. జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం అన్న గేయం తెలంగాణ ఉద్యమ సమయంలో, నేడు రాష్ట్ర గేయంగా మారినా దానిని నిలబెట్టింది, గుర్తింపునిచ్చింది, బతికించింది పిల్లలేనని గుర్తు చేశారు. విద్యార్థి దశలోనే ఇంత గొప్ప కవిత్వం రాసిన బాలలు రాబోయే రోజుల్లో తమ సాహితీ ప్రక్రియ ద్వారా సమాజంలో ఉన్నత మార్పులు తీసుకురావడానికి తమను తాము గొప్పగా మలుచుకోవాలని సూచించారు. అంతర్జాలం కంటే మానవ మేధస్సు ఎంతో గొప్పదని, అంతర్జాలాన్ని అవసరాల కోసం మాత్రమే వినియోగించుకోవాలని అన్నారు. నిత్యం మెదడుకు పని పెట్టకపోతే విషయాన్ని మరిచిపోయే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. కుల మతాలను పక్కనపెట్టి బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పిల్లలు ఎగిరే పక్షుల వంటి వారని, ఎన్నడూ పాఠశాలకు వెళ్ళని తనకు అక్షరాల విలువ తెలుసునని, చదివే సకల సమస్యలకు పరిష్కారమని చెప్పారు. అక్షరమే అమ్మ అని విద్యార్థులు అక్షరాలను ఆయుధాలుగా మార్చుకుంటే అదే సమాజంలో గుర్తింపు తెస్తుందన్నారు. ప్రతి ఒక్కరిలో ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని వెలికి తీస్తేనే గుర్తింపు కలుగుతుందన్నారు.



పానగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు రాసిన ఫ్లయింగ్ బర్డ్స్ కవితా సంకలనానికి ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు సి కిరణ్ కుమార్ సంపాదకత్వం వహించారు. ఈ పుస్తకంలో మొత్తం 69 కవితలు ఉన్నాయి. ప్రతి కవిత ఎంతో పరిణితితో, తమ స్థాయికి మించి రాసారని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రజాకవి జనజ్వాలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గాయకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లల వ్యక్తిత్వానికి సృజనాత్మకతే మూలం అష్టావధానం, పుస్తకా విష్కరణ సభలో డిఇఓ శేఖర్




తిరుపతి నగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్‌లో జరిగిన బాలకథానిధి పుస్తకావిష్కరణ మరియు అష్టావధానంలో ముఖ్య అతిథిగా డిఇఓ శేఖర్ పాల్గొని, బాలకథానిధి పుస్తకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడానికి వారిలో భాషా సామర్థ్యాలను వెలికి తీసి సృజనాత్మకంగా ఆలోచించేలా తీర్చిదిద్దాలని అన్నారు. విశిష్ట అతిథి సాకం నాగరాజ మాట్లాడుతూ నేటి పిల్లలకు పఠనంపై ఆసక్తి పెంచేలా కథలు పుస్తకాలు చదివించాలన్నారు. అష్టావధానం కార్యక్రమానికి సమన్వయకర్తగా శతావధాని ఆముదాల మురళి వ్యవహరించగా హర్ష అవధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

## 'బుద్ధి బలం' నాటిక

01.10.2024 నాడు పిల్లల కోసం ప్రముఖ సినీ రచయిత పెద్దింటి అశోక్ రాసిన 'బుద్ధి బలం' నాటికను లండన్ లోని వకిహం జిల్లా విన్నర్స్ పట్టణంలో ప్రదర్శించారు. ఈ పౌరాణిక



పాత్రలో నటించిన చిన్నారులు గరిపెల్లి శ్రద్ధ, గరిపెల్లి శ్రేయ, సహానా, విహాన్, అగస్త్య, నందిత్ శ్రీరామ్, అమైరా, ఆద్య, అభయ్‌లకు అభినందనలు తెలిపారు.

## మాచిరాజు బాలసాహిత్య పీఠం

మాచిరాజు బాల సాహిత్య పీఠం ప్రతి సంవత్సరం ఇద్దరు బాల సాహితీవేత్తలను మాచిరాజు సీతారామయ్య, రత్నకుమారి దంపతుల స్మారక బాల సాహిత్య పురస్కారంతో సత్కరిస్తుంది. 2023 సంవత్సరానికి గానూ వసుంధర దంపతులను డా. దాసరి వెంకట రమణ గార్లను సత్కరించడం జరిగింది. ఈ సంవత్సరం కవి, రచయిత, బాలసాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత శ్రీ పత్తిపాక మోహన్‌గారిని మరియు బాల సాహితీవేత్త, 'మాస్టర్ స్టోరీ టెల్లర్", కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత శ్రీ చొక్కాపు వెంకట రమణ గారిని ఈ పురస్కారానికి ఎంపిక చేయడం జరిగిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. ఈ పురస్కారం క్రింద వారికి నగదు రూ. 6000/- జ్ఞాపిక, శాలువాలతో నవంబర్ 3 ఆదివారం నాడు సమావేశ మందిరం, రవీంద్ర భారతిలో ఉదయం 10 గంటలకు జరిగే సభలో సత్కరించడం జరుగుతుంది.

## రచనలకు ఆహ్వానం సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్

ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, రచయితలకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి... పాఠశాల విద్యాశాఖ- సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో విద్యా, విషయక, విజ్ఞాన అంశాలతో కూడిన మ్యాగజైన్ రాబోతుంది. కథలు, వ్యాసాలు, కవితలు, గేయాలు, జోకులు, బొమ్మలు, కార్టూన్లు, అనువాద రచనలు, సృజనాత్మక బోధనా పద్ధతులు, విద్యార్థులు రూపొందించిన ఉత్తమ ప్రాజెక్టులు... ఇలా ఏ అంశాన్నయినా రాసి పంపండి. మీ పేరు, ఫోన్ నంబరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జోడించండి. ప్రచురితమైన వాటిలో ఉత్తమ రచనలకు చక్కని బహుమతి ఇవ్వబడును. మీ రచనలు పంపాల్సిన చిరునామా: స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ & ఎడిటర్ సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం, కేబీసీ బాయ్స్ హైస్కూల్ కాంపౌండ్, పటమట, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్: 520010, వాట్సాప్ నంబర్: 7993329112, apsamagramedia @ gmail.com


**- బాలచెలిమి డెస్క్**

# సరోజినీ నాయుడు



సరోజినీ నాయుడు 1879 ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో బెంగాలీ తల్లిదండ్రులైన అఘోరనాథ్ చటోపాధ్యాయ, బరాద్ సుందరి దేవి చటోపాధ్యాయలకు జన్మించారు. ఆమె తండ్రి హైదరాబాద్‌లోని నిజాం కళాశాలను నిర్వహించేవారు, ఆమె తల్లి గొప్ప కవయిత్రి.

సరోజినీ తన విద్యను పూర్తి చేసిన తరువాత ప్రదీప్ గోవిందరాజులు నాయుడును వివాహం చేసుకుంది. ఈ దంపతులకు ఐదుగురు పిల్లలు. వారిలో ఒకరు–పైడిపతి పద్మజ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1905లో బెంగాల్ విభజన తరువాత, సరోజినీ నాయుడు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడం ప్రారంభించారు. మహాత్మా గాంధీ, గోపాల కృష్ణ గోఖలే మరియు రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి నాయకులతో ఆమె సమావేశం బ్రిటిష్ వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక సంస్కరణల వైపు పని చేయడానికి ఆమెను ప్రోత్సహించింది. 1915 మరియు 1918 మధ్య ఆమె సాంఘిక సంక్షేమం, మహిళల విముక్తి మొదలైన వాటిపై ఉపన్యాసాలు ఇవ్వడానికి దేశవ్యాప్తంగా పర్యటించారు. 1917లో ఆమె ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్ ఏర్పాటుకు సహాయపడింది. (WIA). ఆ సంవత్సరం తరువాత లండన్ లోని జాయింట్ సెలెక్ట్ కమిటీ ముందు భారతదేశానికి సార్వత్రిక ఓటు హక్కును సమర్పించడంలో ఆమె తన సహోద్యోగి, హోమ్ రూల్ లీగ్ అధ్యక్షురాలు అనిబెసెంట్‌తో కలిసి ఉన్నారు. ఆమె బ్రిటిష్ అధికారులచే పదేపదే అరెస్టులను ఎదుర్కొంది. 21 నెలలకు పైగా జైలులో గడిపింది. ఆమె 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, సరోజినీనాయుడు ఉత్తరప్రదేశ్ మొదటి గవర్నర్ జనరల్ అయ్యారు.



గోల్డెన్ థ్రెషోల్డ్ అనేది హైదరాబాద్ విశ్వవిద్యాలయం యొక్క ఆఫ్–క్యాంపస్ అనుబంధం. ఈ భవనం తన తండ్రి అఘోర్నాథ్ ఛటోపాధ్యాయ నివాసం. దీనికి నాయుడి మొదటి కవితా సంకలనం పేరు పెట్టారు. గోల్డెన్ థ్రెషోల్డ్‌లో ఇప్పుడు హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన సరోజినీ నాయిడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఉంది. గోల్డెన్ థ్రెషోల్డ్ నాంపల్లి స్టేషన్ రోడ్డులో ఉంది.

స్వాతంత్ర్య పోరాట సమయంలో హైదరాబాద్‌లోని ఛటోపాధ్యాయ కుటుంబ నివాసం అనేక సంస్కరణల ఆలోచనలకు, విద్య, వివాహం, కళలు, మహిళల సమస్యలేకాక అనేక రంగాలలో మహిళల భాగస్వామ్యం కోసం మరి ఎన్నో చర్చా కార్యక్రమాలకు కేంద్రంగా నిలిచింది. కవిగా ఆమె చేసిన కృషి ఆమె కవిత్వం వర్ణచిత్రాలు మరియు సాహిత్య సృజనాత్మక ప్రతిభ కారణంగా మహాత్మా గాంధీచే 'ది నైటింగేల్ ఆఫ్ ఇండియా' లేదా 'భారత్ కోకిల' అనే బిరుదును సంపాదించింది. 1949 మార్చి 2న గుండె పోటుతో సరోజినీనాయుడు కన్ను మూశారు. ఈ రోజు వరకు ఆమె స్వతంత్ర భారత దేశం లోని ప్రముఖ కవులలో ఒకరిగా పరిగణించబడుతున్నారు.

– సువేగా

# Oxford Grammar High School

OGS JUNIORS
grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



## We make school time the **best time** for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- **Loving atmosphere & play ground**
- **CCTV surveillance**
- **Certified teachers & caring staff**
- **Kids zone & play area**
- **Interactive & Value based Learning**

### CARING TEACHERS & STAFF
Your child will get the best care and attention

### ECO-FRIENDLY PRACTICES
We let the children play with nature friendly material

### HUGE PLAYGROUND
Your child will get lots of fresh air and playtime

### INTERACTIVE LEARNING
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication - 23rd October, 2024
Postal Dates: 24th & 26th Every Month

RNI Regn. No. 52828/92 TC No. TEL Tel01232
Postal Regn.No.HCD-5022/2024-2026

## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

### తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



ప్రతులకు

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com